నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433
E-mail:netinijam93@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 10-10-2025
NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026 Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.
సంపుటి :32 సంచిక:54 పేజీలు:6 వెల: రూ.1/-

**నేటి కందం- నేటికి అందం**

నాలుగు రాష్ట్రము లందున
చాలగ జిల్లాలు కలిపి సౌకర్య మిడన్
మేలగు రైల్వే లైన్లకు
మాలిమి కాడైన మోడి మంజూరు నిడెన్ !!

(మహరాష్ట్ర,మధ్యప్రదేశ్, గుజరాత్,ఛత్తిస్ గడ్ లలోని చాలా జిల్లాలను కలుపుతూ క్రొత్త రైల్వే లైన్ లను మోడీ ప్రభుత్వం మంజూరు చేసింది.
మొత్తం వ్యయం రు 24634 కోట్లు కాగా మొత్తం దూరం 894 కిలోమీటర్లు)

-రాధశ్రీ
సెల్:9494481210



**చురక**

ప్రభుత్వాధినేతగా
పాతికేళ్ల ప్రస్థానం
డెబ్బై ఐదు నిండినా
డోకాలేని ఆస్థానం.
ఏజ్ మీద పార్టీలో
ఎందరికో పరిమితులు
కొందరికే పదవిలో
కొనసాగే అనుమతులు

-వేల్పుల నారాయణ
9440433475





# జీవోనెం.9పై హైకోర్టు స్టే

హైదరాబాద్, అక్టోబర్ 9: బీసీ రిజర్వేషన్ లో కీలకమైన జీవోనెం.9పై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. బీసీ రిజర్వేషన్ కు సంబంధించి నిన్నటి నుంచి హైకోర్టులో విచారణ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈరోజు మధ్యాహ్నం విచారణ ప్రారంభించిన హైకోర్టు జీవో నెం.9పై స్టే విధించింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్ ను హైకోర్టు ఆదేశించింది. కాగా, హైకోర్టు నుంచి స్టే కాపీలు అందగానే ఎన్నికలపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటుందని సమాచారం.

తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ రోజు ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. బీసీ కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని, స్వాతంత్ర్యం తర్వాత సమగ్ర కులగణన సర్వే తెలంగాణలోనే జరిగిందని అన్నారు. ఇంటింటికెళ్లి సర్వే చేశారని, ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో బీసీ జనాభా 57.6శాతం ఉన్నట్లు తేలిందన్న ఆయన.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు కోర్టుకు వివరించారు.

బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనం ఉందని గుర్తించే.. అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. మరో న్యాయవాది రవివర్మ తన వాదనలు వినిపిస్తూ రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50శాతం సీలింగ్ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారని, 85 శాతం జనాబాకు 42 శాతంతో కలిపి 67 శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నామని వివరించారు. 15 శాతం జనాభాకు 33 శాతం ఓపెన్ గానే ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9పై స్టే విదిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# దగ్గు మందు మరణాలపై సుప్రీంలో పిల్.. విచారణకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం..

న్యూఢిల్లీ, అక్టోబర్ 9:మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కాఫ్ సిరప్ తాగిన పిల్లలు మరణించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై దాఖలైన ప్రయోజన ప్రయోజన వ్యాజ్యంపై విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. సర్వోన్నత న్యాయస్థానం కేసును విచారించేందుకు జాబితా చేసింది. న్యాయవాది, పిటిషనర్ విశాల్ తివారీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్వల్ భూయాన్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఘటన తీవ్రమైందని.. అత్యవసర విచారణ అవసరమని పేర్కొంది. చిన్నారుల మృతిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని, సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో జాతీయ న్యాయ కమిషన్ లేదంటే నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు.

విషపూరిత కాఫ్ సిరప్‌ల కారణంగా పిల్లల మరణాలకు సంబంధించిన అన్ని ఎఫ్ఐఆర్‌లు, కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలని.. దేశవ్యాప్తంగా ఏకరీతిన, నిష్పాక్షిక దర్యాప్తు జరిగేలా చూడాలని న్యాయవాది విశాల్ తివారీ కోర్టును కోరారు. మార్కెట్‌లోకి ప్రమాదకరమైన మందులు నిరంతరం ప్రవాహంలా వస్తున్నాయని పిటిషనర్ ఆరోపించారు. వ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకువచ్చేందుకు కేంద్రీకృత దర్యాప్తు అవసరమని.. తక్కువ నాణ్యత మందులు మార్కెట్‌కు వచ్చే ముందు డ్రగ్ సేఫ్టీ, క్వాలిటీ పరీక్ష వ్యవస్థలో ఎక్కడ లోపాలు జరిగాయో తెలుసుకునేలా కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషనర్ కోరారు. అమ్మకాలు, ఎగుమతికి అనుమతి ఇచ్చే ముందు అన్ని అనుమానిత ఉత్పత్తులను ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన ల్యాబ్‌లలో టాక్సికాలజీ పరీక్ష చేయించడం తప్పని సరి చేయాలని కోర్టును కోరారు.

# బీసీలకు రిజర్వేషన్లు అమలు కాకుండా నోటికాడ ముద్ద లాక్కునే ప్రయత్నం చేసారు

## -42% రిజర్వేషన్లు బీసీలకు ఇస్తాం ఆ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు

## - మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్ అక్టోబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీసీలకు రిజర్వేషన్లు అమలు కాకుండా నోటికాడ



ముద్ద లాక్కునే ప్రయత్నం చేసారు,బీసీ రిజర్వేషన్లకు ఎవరు అడ్డుపడుతున్నారో....యావత్తూ తెలంగాణ ఆలోచన చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు.ప్రభుత్వం బీసీలపై చిత్తశుద్ధితో రాష్ట్రంలో ఎంపారికల్ డేటా చేపట్టడం జరిగింది ఎంపారికల్ డేటా ఉన్నా స్టే విధించి బీసీల నోటికాడ ముద్ద లాగే ప్రయత్నం చేయడం శోషనీయం42% రిజర్వేషన్లు బీసీలకు ఇస్తాం ఆ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదుప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాటపై కట్టుబడి ఉన్నాం...కట్టుబడి ఉంటాంరాబోయే రోజుల్లో ఏ విధంగా ముందుకు వెళ్ళాలో ఆలోచన చేస్తాంబీసీ బిడ్డలు ఎవరు అధైర్యపడొద్దన్నారు.బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేవిధంగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందిబిజెపి,బిఆర్ఎస్ బిసి రిజర్వేషన్లకు అనుకూలంగా కేసులో ఇంప్లీడ్ అవ్వాలి....లేకపోతే చరిత్రలో బీసీ ద్రోహులుగా మిగిలిపోతారు

# హైకోర్టు స్టే విధిస్తుందని అనుకోలేదు..

## -మంత్రి పొన్నం ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 9:బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం బాధాకరమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కాపీ అందిన తరువాత చట్టపరంగా, న్యాయపరంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం తరుఫున హైకోర్టులో బలమైన వాదనలు వినిపించడం జరిగిందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం కుల సర్వే నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ వేసి, సబ్ కమిటీ వేశామని గుర్తు చేశారు. అనంతరం కేబినెట్ ఆమోదించి.. శాసనసభలో చట్టం చేసి గవర్నర్‌కి బీసీ బిల్లును పంపడం జరిగిందని స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలు జరపకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని మంత్రి పొన్నం పేర్కొన్నారు. హైకోర్టు స్టే విధిస్తుందని అనుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ధీమా వ్యక్తం చేశారు. సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు హైకోర్టులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదో జవాబు చెప్పాలని పొన్నం నిలదీశారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయంతో ఎన్నికలకు వెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.

# బీసీలకు తీరని అన్యాయం.. తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తాం : ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్, అక్టోబర్ 9: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సంఘం అధినేత ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రంలోగా స్పందించకపోతే తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. హైకోర్టు వద్ద ఆర్ కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు.

ఎన్నికల ప్రక్రియను రెండు వారాల పాటు ఆపడమనేది దురదృష్టకరం. ఎందుకంటే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికలను ఆపొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా రెండు వారాల పాటు ఎన్నికలను వాయిదా వేయడం తాము తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 56 శాతం బీసీ ప్రజల హక్కులకు విఘాతం కలిగిస్తుంది. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. నోటికాడి అన్నం ముద్దను లాక్కున్నారు. నిన్నటి నుంచి విచారణ జరిపిన కోర్టు.. మరో రెండు రోజులు సమయం తీసుకుని ఇంకా విస్తృతంగా విచారణ చేపట్టాల్సి ఉండే. ఎందుకు ఆదరబాదరగా స్టే విధించాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం అని ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు.

ఈరోజు సాయంత్రంలోగా ప్రభుత్వం స్పందన ఏంటో చూస్తాం. తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి రాష్టాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. బీసీల్లో ఏంతో చైతన్యం వచ్చింది.. ఊరురా స్పందన తెలుపుతాం. సీఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. సాయంత్రంలోగా ప్రకటించాలి. లేదంటే పెద్ద ఎత్తున బంద్ నిర్వహిస్తాం. దేశాన్ని కదిలించేలా బంద్ ఉంటుంది. ఏం తమాషాగా ఉందా.. బీసీలంటే అంత చులకనగా ఉందా.. ముఖ్యమంత్రి పదవులు రావు మంత్రి పదవులు రావు.. లేక లేక సర్పంచ్ అవకాశం వస్తే వాటిని కూడా లాగేసుకోవడం సరికాదు. ఈ సమాజంలో బీసీల సత్తా ఏంటో చూపిస్తాం. స్టే విధించడం చాలా దురదృష్టకరం. రేపట్నుంచి రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు.

# ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా "సేవా పక్వాడా" కార్యక్రమం

హైదరాబాద్ అక్టోబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో ఘనంగా "సేవా పక్వాడా" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాం చందర్ రావు సమాజానికి సేవలం దించిన విశిష్ట వ్యక్తులు, పద్మ అవార్డు గ్రహీతలను సన్మానించడం జరిగింది. వారు సాధించిన విజయాలు, అందించిన సేవలను గౌరవిస్తూ యువతకు స్ఫూర్తినిచ్చే విధంగా కార్యక్రమాన్ని పొందించారు.డాక్టర్లు, క్రీడాకారులు, వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులను సత్కరించి, తద్వారా రాబోయే తరాలకు ప్రేరణ దించడమే ఉద్దేశ్యం.ప్రధానంగా యువతలో స్ఫూర్తి నింపడం, నశా ముక్త్ భారత్ (డ్రగ్స్ ఫ్రీ నేషన్) గా తీర్చిదిద్దడం లక్ష్యంగా ముందుకెళ్లాలి.విద్యార్థులు, యువత క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని డ్రగ్స్ నుంచి విముక్తి పొందేలా స్ఫూర్తినింపాలి.ఈ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, యువత నుంచి మంచి స్పందన వచ్చింది.

# రైతులకు శుభవార్త.. పంట కొనుగోలుపై మంత్రి తుమ్మల ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 9:తెలంగాణ రైతులకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తీపికబురు చెప్పారు. మొక్కజొన్న పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందని ప్రకటించారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డితో మద్దతు ధరకు మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడంపై మంత్రి సుధీర్ఘంగా చర్చించారు. అయితే కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతుధర ప్రకటించినా.. కొనుగోళ్లు చేసేందుకు ముందుకు రాలేదని చెప్పారు. దీంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి సూచనతో సర్కారే మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. గతేడాది కూడా ఇలాగే ఎలాంటి కొనుగోళ్లు జరపకపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వమే దాదాపు రూ.535 కోట్లు ఖర్చు పెట్టి జొన్న పంటను మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిందని గుర్తుచేశారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,24,544 ఎకరాల్లో మొక్కజొన్న సాగు అయిందని మంత్రి వివరించారు.

సాగు పరిస్థితులు వృద్ధి చెందడంతో సగటున ఎకరాకు 18.50 క్వింటల్ దిగుబడితో మొత్తం 11.56 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేసినట్టు చెప్పారు. ఈ పంటకాలంలో 8.66 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసిందని పేర్కొన్నారు.

మార్కెట్లోకి సెప్టెంబర్ 3 వ వారం నుండే మొక్కజొన్న పంట అధికంగా రావడంతో ధరలు తగ్గిపోయాయని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ ధరలు కేంద్రం ప్రకటించిన ఎమ్ఎస్పీ (రూ.2,400/క్వింటల్) కన్నా రూ.441 తక్కువగా రూ.1,959 ఉందని వివరించారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. 8.66 లక్షల మెట్రిక్ టన్నులు మొక్కజొన్న పంటను కొనుగోలుకు సర్కార్ పై రూ.2400 కోట్ల భారం పడుతుందని, అయినా రైతులకు ఎలాంటి నష్టం జరుగకుండా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతు తాను పండించిన మొక్కజొన్న పంటను సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని వివరించారు.

# నా మొక్క నా బాధ్యత కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి..



మెదక్, అక్టోబర్ 9:చిలిపిచెడ్ మండల కేంద్రమైన సమైక్య కార్యాలయంలో వీవోఏల సమావేశం నిర్వహించినట్టు మండల ఐకెపి ఏపీఎం గౌరీ శంకర్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస రావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిలిపిచెడ్ మండలంలో ఉన్న మహిళా సంఘాలకి అవసరానికి అనుగుణంగా రావాల్సిన రుణాలను బ్యాంకు ద్వారా ఇప్పించడంలో ఎదుర్కొంటున్న సమస్యలపై కూలంకషంగా చర్చించడం జరిగింది. వాటికి శాశ్వత సమస్య దిశగా పరిష్కారం నిర్దేశించడం జరిగింది. గ్రామం వారీగా వివోఏలను సంఘం వారీగా రుణ వితరణ గురించి సమీక్షించామన్నారు.

అంతేకాకుండా చిలిపిచెడ్ మండలంలోని 387 సంఘాల్లో ఉన్న 4045 మంది సభ్యురాలు తమ ఇంటి వద్ద లేదా పొలం వద్ద ఒక బహువార్షిక మొక్కని పెంచి మూడు సంవత్సరాలు పోషణ చేసి సమాజానికి అంకితం ఇవ్వాలనీ, నా మొక్క నా బాధ్యత అనే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వీవోఏలకు మార్గం నిర్దేశకం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారితోపాటు ఏపీఎం గౌరిశంకర్, సీసీలు పురుషోత్తం, వెంకటలక్ష్మి, శ్రీకాంత్, విజయలక్ష్మి, లక్ష్మణ్, అకౌంటెంట్ మానస, వివోఏలు సరిత, రేణుక, వీరమని, మాధవి, రమణి, మహేశ్వరి, మంగ, మంజుల, బాగయ్య పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో రూ. 10 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

హైదరాబాద్, అక్టోబర్ 9:రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రతి రోజు నగరం నలుమూలల ఎక్కడో ఒక చోట డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా రూ. 10 కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎఫిడ్రిన్ అనే డ్రగ్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివరాల్లోకి వెళ్తే.. జీడిమెట్ల పరిధిలోని సుచిత్రా క్రాస్ రోడ్స్ సమీపంలోని స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో సాయిదత్తా రెసిడెన్సీలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు ఈగల్ టీమ్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఈగల్ టీమ్ అక్కడ దాడులు నిర్వహించి.. 220 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. పట్టుబడ్డ డ్రగ్ విలువ రూ. 10 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. అదే అంతర్జాతీయ మార్కెట్‌లో అయితే రూ. 70 కోట్లు విలువ చేస్తుందన్నారు.

ఈ డ్రగ్స్ దందాకు సంబంధించి నలుగురిని అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో వాస్తవాయి శివరామకృష్ణ వర్మ, దంగేటి అనిల్, మద్దు వెంకటకృష్ణ, ఎం ప్రసాద్, ముసిని దొరబాబు ఉన్నారు. వీరంతా ఏపీలోని కాకినాడ, తూర్పు గోదావరి, నెల్లూరు జిల్లాలకు చెందిన వారని పోలీసులు తేల్చారు.

# వైద్య రంగంలో భారత్ విశ్వగురు కావాలి..

## – కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, అక్టోబర్ 9:భారత్ వైద్యరంగంలో వసతులు మరింత పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. డాక్టర్ విజయనంద్ రచించిన 'నేను క్యాన్సర్‌ను జయించాను' అనే పుస్తకాన్ని కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంబీబీఎస్ పీజీ సీట్లు కేంద్ర ప్రభుత్వం పెంచిందని పేర్కొన్నారు. గతంలో 387 మెడికల్ కాలేజీలు ఉంటే, ఇప్పుడు 808 మెడికల్ కాలేజీలు ఉన్నాయని చెప్పారు. విదేశాలతో పోలిస్తే భారత్‌లో మెరుగైన వైద్యం అందుతుందని స్పష్టం చేశారు.

అలాగే దేశంలో మెడికల్ టూరిజం పెరిగిందని కిషన్ రెడ్డి అన్నారు. వ్యాక్సిన్లు, మందులు తయారీలో భారత్ టాప్‌లో ఉందని ధీమా వ్యక్తం చేశారు. వాటితో పాటు డయాబెటిస్ సమస్య కూడా దేశంలో పెరిగిందని చెప్పుకొచ్చారు. దేశంలో అత్యధిక డయాబెటిస్ బాధితులు హైదరాబాద్‌లోనే ఉన్నారని పేర్కొన్నారు. వైద్య రంగంలో భారత్ విశ్వ గురువు కావాలని ఆయన సూచించారు. రోగులపట్ల నిజమైన దేవుళ్ళు డాక్టర్లే అని స్పష్టం చేశారు. క్యాన్సర్ వస్తే ప్రాణంపై ఆశలు ఉండవు అని వివరించారు. కానీ ఇప్పుడు క్యాన్సర్‌ను ఎంతోమంది జయిస్తున్నారని అన్నారు. దీంతో బాధితుల్లో క్యాన్సర్‌పై గెలుస్తామనే విశ్వాసం పెరిగిందని కిషన్ రెడ్డి తెలిపారు.

మెడిసిన్ మాత్రమే కాదు, డాక్టర్లు ఇచ్చే విశ్వాసం కూడా రోగులను బ్రతికిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భారతదేశంలో రోజురోజుకు క్యాన్సర్ పేషెంట్లు పెరుగుతున్నారని గుర్తు చేశారు. క్యాన్సర్ వచ్చాక దాన్ని జయించిన సక్సెస్ స్టోరీస్ చాలా ఉన్నాయని చెప్పారు. కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యాక కోలుకున్న వాళ్ళు మాత్రం తక్కువగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుష్మా స్వరాజ్, అరుణ్ అరుణ్ జెట్లీలతో పాటు ఎంతోమంది కిడ్నీ ఫెయిల్యూర్‌తో చనిపోయారని గుర్తు చేశారు. కిడ్నీల విషయంలో మరింత పరిశోధనలు జరగాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు.

# జగిత్యాల కోర్టు ఆదేశాలు

జగిత్యాల,అక్టోబర్ 9:జగిత్యాల ఆర్డీవో కార్యాలయ సామాగ్రిని జప్తు చేయాలని ఈ రోజు జగిత్యాల కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పెద్దపల్లి-నిజామాబాద్ రైల్వే లైన్‌కోసం జగిత్యాల ప్రాంత రైతుల నుంచి తీసుకున్న వంద ఎకరాల భూమిని తీసుకోగా, రైల్వే లైను కోసం తీసుకున్న భూములకు రైతులకు పరిహారం చెల్లించ లేదు. 2006లో ఒక ఎకరా రూ.1.30 లక్షలు ప్రభుత్వం చెల్లించగా, ఆ పరిహారం చాలదని రైతులు కోర్టును ఆశ్రయించారు.హైకోర్టు, సుప్రీం కోర్టులోనూ రైతులకు ఎకరా రూ.15,97,200 చెల్లించాలని గతంలోనే ఆదేశాలు జారీ అయ్యాయి. కోర్టు ఆదేశించినా పరిహారం ఇవ్వకపోవటంతో రైతులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆర్డీఓ కార్యాలయ సామాగ్రిని జప్తు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# రూ. 2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తహసీల్దార్

నల్గొండ, అక్టోబర్ 9: నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహసీల్దార్ కృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గుండ్రంపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ భూమికి సంబంధించన మ్యూటేషన్ కోసం రూ.2లక్షలు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.

తహసీల్ కార్యాలయంలో వ్యూహం ప్రకారం మాటు వేసిన ఏసీబీ అధికారులు గురువారం తహసీల్దార్ గుగులోత్ కృష్ణా , మరో ప్రైవేట్ వ్యక్తి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నాంబర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ సిబ్బంది లంచాలకు పాల్పడితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# భారతీయ తపాలా సేవలకు 188 ఏండ్లు

## (10 అక్టోబర్ "జాతీయ తపాలా దినోత్సవం" సందర్భంగా)

ఒకనాడు సమాచారాన్ని పావురాలు, గుర్రపు స్వారీ చేసే వ్యక్తుల ద్వారా పంపించడం గూర్చి మనకు తెలుసు. తర్వాత కాలక్రమంలో పలు మార్పులు చెందుతూ ప్రభుత్వాలు తపాలా శాఖలను ఏర్పాటు చేయడంతో ఉత్తరాల బట్వాడా ప్రారంభమైంది. 1837లో బ్రిటీష్ ఇండియా గవర్నర్ జనరల్ "లార్డ్ డల్హౌసీ" చొరవతో ఈస్ట్ ఇండియా కంపెనీ తొలిసారి దేశంలో తపాలా వ్యవస్థను ముఖ్య నగరాల్లో ఏర్పాటు చేసి, తదుపరి దేశవ్యాప్తంగా విస్తరించింది. భారత ఆధునిక తపాలా సేవలను స్థాపించిన "లార్డ్ డల్హౌసీ"ని భారత తపాలా సేవల పితామహుడిగా అభివర్ణించారు. 1854లో భారతీయ తపాలా శాఖ ఆధునీకరణ చేయబడి ప్రజలకు మరింత చేరువైంది. 1947లో స్వాతంత్ర్యానంతరం "ఇండియన్ పోస్టల్ డిపార్ట్మెంట్" ప్రారంభమైంది. కాలక్రమంలో టెక్నాలజీని అందిపుచ్చుకొని మారుమూల ప్రాంతాలకు సహితం తపాలా సేవలు విస్తరించాయి. 20వ శతాబ్దంలో టెక్నాలజీ వినియోగంతో టెలిఫోన్, టెలెక్స్ మెషిన్స్, కంప్యూటరైజేషన్ వంటివి అందుబాటులోకి రావడంతో భారతీయ తపాలా విభాగం కొత్త పుంతలు తొక్కుతూ ముందుకు సాగుతోంది.

**జాతీయ తపాలా దినోత్సవం-2025:**

1982లో భారత తపాలా విభాగం తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 10 అక్టోబర్ రోజు "జాతీయ తపాలా దినోత్సవం" లేదా "నేషనల్ పోస్ట్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. దేశ, ప్రపంచ ప్రజలను అనుసంధానం చేయడం, డిజిటల్ ప్రపంచంలో కమ్యూనికేషన్, వాణిజ్యం, సామాజిక అభివృద్ధి లాంటి ప్రధాన అంశాలకు మద్దత్తుగా నిలవడంలో భారతీయ తపాలా సేవల విభాగం ప్రధాన భూమిక నిర్వహించం ముదావహం. గ్రామాలను, పట్టణాలను కలపడంలో వారధిగా తపాలా సేవలు అవిశ్రాంత సేవలు అందిస్తున్నాయి. ఈ రోజున ప్రదర్శనలు, కవాతులు, పోస్టల్ వర్కర్స్ సన్మానాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

**సరిహద్దులను చెరిపి సముద్రాలు దాటుతూ..!**

ప్రతి ఏట 09 అక్టోబర్ రోజున "ప్రపంచ తపాలా దినోత్సవం" నిర్వహించుకోవడం కూడా జరుగుతోంది. పోస్టల్ సేవలతో ప్రపంచ సరిహద్దులు చెరిగి పోయాయి. గ్రామాలతో పట్టణాలు అనుసంధానం అవుతున్నాయి. మన ఊరి నుంచి పంపించిన పోస్టల్ కవర్స్ కొన్ని రోజుల్లో విదేశీ గమ్య స్థానాలకు చేరుతున్నాయి. తపాలా సేవల్లో ఆర్థిక కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నాయి. తపాలా సేవలతో ప్రపంచం కుగ్రామం అయ్యింది. అంతర్జాతీయ వాణిజ్యం సులభం అయింది. నమ్మకమైన, సురక్షితమైన సమాచార వితరణ జరుగుతున్నది. చేవ్రాత ఉత్తరం నుంచి డిజిటల్ లాజిస్టిక్స్ వరకు అన్నీ తపాలా సేవల్లో భాగం అయ్యాయి. దూరాలను చెరిపి వేస్తూ, సంస్కృతులను కలుపుతూ తపాలా సేవలు కొనసాగుతున్నాయి. ఆన్‌లైన్ సేవలు, మారుమూల ప్రజలకు సేవలు, భద్రతతో కూడిన తపాలా సేవలు, అత్యవసర సమయాల్లో నమ్మకమైన సేవలను నేడు తపాలా శాఖలు నిర్వహిస్తున్నాయి.

### ప్రభుత్వ పోస్టల్ సేవలు - ప్రైవేటు కొరియర్ సేవలు :

నేటి డిజిటల్ యుగంలో వెలసిన అంతర్జాతీయ కొరియర్ సంస్థలతో ప్రభుత్వ తపాలా శాఖలు తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నాయి. నేడు ఉత్తరాల బట్వాడా తగ్గడంతో ప్రభుత్వ పోస్టల్ విభాగాలు తమ విధులను పునర్ నిర్వహించుకోవడం తప్పనిసరి అయ్యింది. నేడు భారతీయ పోస్టల్ విభాగం మెయిల్స్, పార్సల్స్, బ్యాంకింగ్ తదితర సేవలను అందిస్తూ ముందుకు సాగుతోంది. దేశవ్యాప్తంగా 1,64,999 పోస్ట్ ఆఫీసుల ద్వారా వేగంగా ఉత్తరాలను బట్వాడా, బ్యాంకింగ్ సేవలను చేయడంలో నిమగ్నం అయ్యింది. నమ్మదగిన సంస్థలుగా భద్రత విషయంలో ప్రభుత్వ తపాలా సేవలు నేటికీ అప్రతిహతంగా కొనసాగుతున్నాయి. ప్రైవేట్ కొరియర్ కంపెనీలు లాభాపేక్షతో వ్యాపారం చేస్తున్నాయి. ప్రభుత్వ తపాలా సేవలు బాధ్యతగా మారుమూల ప్రాంతాల్లో సహితం తమ సేవలను అందిస్తూ, ప్రజల మన్ననలు పొందుతున్నాయి.

ఇండియన్ పోస్టల్ డిపార్ట్మెంట్ అంటే ఓ నమ్మకం, అమితమైన విశ్వాసం. భారతీయ పోస్టల్ సేవలు దేశ, ప్రపంచ మానవాళిని ఏకం చేస్తున్నాయి. పోస్ట్ అంటే అక్షరాలు మాత్రమే కాదని, ఆశలతో కూడిన సువార్తలు తెచ్చే వారసులని తెలుసుకుందాం. ఉత్తరం చేతులు మారితే రెండు హృదయాల కలయిక జరుగుతుంది. డిజిటల్, ఫిజికల్ ప్రపంచాన్ని కలిపే వారధిగా పోస్టల్ సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో కూడా నిర్విరామంగా కొనసాగాలని కోరుకుందాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ప్రభుత్వ అధినేతగా 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 9:ప్రభుత్వ అధినేతగా సేవలను అందించడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 25వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా... దేశ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2001లో ఇదే రోజున గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణాన్ని స్వీకరించినప్పటి నుంచి తన ప్రయాణాన్ని ప్రధాన మంత్రి గుర్తు చేసుకున్నారు. ప్రజల జీవనాన్ని మెరుగుపరచడంతో పాటు దేశ పురోగతికి తన వంతు పాటుపడాలన్నదే తన నిరంతర ప్రయత్నమని ఆయన అన్నారు.

ఎన్నో సవాళ్లతో కూడుకున్న పరిస్థితుల్లో గుజరాత్ ముఖ్యమంత్రి బాధ్యతను తనకు అప్పగించారని ప్రధానమంత్రి తెలిపారు. ఆ సంవత్సరంలో భయంకర భూకంపం సంభవించడంతో రాష్ట్రం విలవిల్లాడుతోంది. అంతకు ముందు కాలంలో రాష్ట్రం ఒక పెను తుపాను బారిన పడింది. ఆ తర్వాత వరుసగా దుర్భిక్షం, రాజకీయ అస్థిరతలు ఎదురయ్యాయి. ఈ సవాళ్లు ప్రజలకు సేవ చేయాలన్న, కొత్త ఉత్సాహంతోనూ, ఆశతోనూ గుజరాత్ ను పునర్నిర్మించాలన్న తన సంకల్పాన్ని మరింత బలపరిచాయని ఆయన అన్నారు.

గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ సమయంలో తల్లి చెప్పిన మాటలు తన మదిలో మెదిలాయని శ్రీ మోదీ అన్నారు. పేదల కోసమే ఎల్లప్పుడూ పనిచేస్తూ ఉండాలి... ఎట్టి పరిస్థితుల్లోనూ లంచం తీసుకోకూడదు.. అని తన మాతృమూర్తి తనతో చెప్పారని ఆయన అన్నారు. తాను ఏది చేసినా సదుద్దేశంతోనే చేస్తాననీ, సమాజంలో చిట్టచివరి పంక్తిలో నిలబడ్డ వ్యక్తికి కూడా సేవ చేయాలనే భావనే తనకు స్ఫూర్తిని ఇస్తోందనీ చెబుతూ తాను ఈ మేరకు ప్రజలకు భరోసా ఇచ్చానన్నారు.

గుజరాత్‌లో తాను అధికారంలో ఉన్న కాలాన్ని ప్రధానమంత్రి గుర్తు చేస్తూ... గుజరాత్ కు పునర్వైభవం రాదని అప్పట్లో ప్రజలు భావించినట్లు తెలిపారు. కరెంటు లేదనీ, నీళ్లు అందడం లేదనీ రైతులు బాధపడే వాళ్లు. వ్యవసాయం సంకటంలో పడిందనీ, పారిశ్రామిక అభివృద్ధి నిలిచిపోయిందనీ నాతో మొరపెట్టుకునేవాళ్లు. అయితే, సమష్టి కృషితో గుజరాత్ సుపరిపాలనకు కేంద్రంగా మారిందని ఆయన అన్నారు. ఒకప్పుడు కరవు గుప్పిట్లో ఉన్న రాష్ట్రం కాస్తా వ్యవసాయ పరంగా అగ్రగామిగా మారిందనీ, వ్యాపారం విస్తరించి తయారీ రంగానికీ, పారిశ్రామికతకూ మార్పు జరిగిందన్నారు. సామాజిక, భౌతిక మౌలిక సదుపాయాల ఊతం లభించిందన్నారు.

2013వ సంవత్సరంలో, పాలనాపరమైన సంక్షోభంతో దేశం సతమతం అవుతున్న కాలంలో... 2014 లోక్ సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిగా నిలబడే బాధ్యతను తనకు అప్పగించారని ప్రధానమంత్రి అన్నారు. దేశ ప్రజలు తన సంకీర్ణానికీ, తన పార్టీకి పూర్తి ఆధిక్యాన్ని ఇచ్చారనీ, తద్వారా ప్రజలు సరికొత్త విశ్వాసానికీ, పాలనకూ అవకాశమిస్తూ...కొత్త యుగానికి నాందీ ప్రస్తావన చేశారని ఆయన వ్యాఖ్యానించారు.

గత 11 ఏళ్లలో భారత్ అనేక గొప్ప మార్పులను చూసిందని ప్రధానమంత్రి తెలిపారు. 25 కోట్ల కన్నా ఎక్కువ మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం, ప్రపంచంలో ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒక ఆకర్షణీయ కేంద్రంగా మారిందని చెప్పారు. అన్నదాతలూ, మహిళలూ, యువత- సరికొత్త ప్రయత్నాలు, సంస్కరణలతో సాధికారులయ్యారని అన్నారు.

భారత్‌ను అన్ని రంగాల్లో స్వయంసమృద్ధంగా తీర్చిదిద్దడమే ప్రజల బలబమైన కోరికగా ఉందని, 'ఇది స్వదేశీ అని గర్వంగా ప్రకటిద్దాం' అన్న నినాదంలో ఈ భావనను చూడొచ్చన్నారు.

దేశ ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకం, చూపిస్తున్న ఆప్యాయతకు కృతజ్ఞతను తెలుపుతూ, దేశానికి సేవ చేయటం అత్యున్నత గౌరవమని ప్రధానమంత్రి అన్నారు. రాజ్యాంగ విలువల మార్గదర్శకత్వంలో వికసిత్ భారత్ కలను సాకారం చేసేందుకు నిబద్ధతతో ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు.

సామాజిక మాధ్యమం "ఎక్స్" పోస్టుల్లో ప్రధానమంత్రి ఇలా పేర్కొన్నారు:

"2001లో ఈ రోజున నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాను. ఒక ప్రభుత్వాధినేతగా నేను 25వ వసంతంలోకి అడుగుపెడుతున్నాను. భారత ప్రజలకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇన్నేళ్లలో ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు, దేశ పురోగతికి నిరంతరం కృషి చేశాను."

"రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు నా పార్టీ గుజరాత్ ముఖ్యమంత్రిగా నాకు బాధ్యతలు అప్పగించింది. ఆ ఏడాది భారీ భూకంపం సంభవించింది. అంతకు ముందు సంవత్సరాల్లో పెను తుపాను, కరువు, రాజకీయ అస్థిరత ఏర్పడ్డాయి. ప్రజలకు సేవ చేయాలనే ఆశను, గుజరాత్ ను పునర్నిర్మించాలనే నా సంకల్పాన్ని ఆనాటి సవాళ్లు మరింత బలపరిచాయి."

"ముఖ్యమంత్రిగా నేను ప్రమాణ స్వీకారం చేసినప్పుడు మా తల్లి చెప్పిన మాటలు గుర్తు చేసుకున్నాను- నీ పని గురించి నాకు అంతగా అవగాహన లేదు, కానీ రెండు విషయాలు గుర్తుంచుకో. మొదటిది, మీరు ఎప్పుడూ పేద ప్రజల కోసం పనిచేయండి. రెండోది, ఎప్పుడూ అవినీతికి పాల్పడకండి. నేను చేసే ప్రతీ పని అత్యుత్తమ సంకల్పంతో, ప్రతి ఒక్కరికీ సేవ చేయాలనే లక్ష్యంతో ప్రేరణ పొందుతానని ప్రజలకు చెప్పాను."

"ఈ 25 ఏళ్ల ప్రయాణం ఎన్నో అనుభవాలతో కూడినది. చెప్పుకోదగిన పురోగతిని సాధించాం. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు, గుజరాత్ ఎప్పటికీ వృద్ధిలోకి రాదనుకున్నారు. సాధారణ పౌరులు, రైతులు.. విద్యుత్, నీటికొరతపై ఫిర్యాదు చేసేవారు. వ్యవసాయ రంగంలో పురోగతి లేదు. పారిశ్రామిక వృద్ధి స్తంభించింది. మేమంతా సమిష్టిగా కృషి చేసి గుజరాత్ ను సుపరిపాలనకు కేంద్రంగా మార్చాం."

"కరువు ప్రాంతమైన గుజరాత్ వ్యవసాయంలో అగ్రస్థానంలో నిలిచింది. వాణిజ్యం విస్తరించి, పారిశ్రామిక, తయారీ సామర్థ్యాలు పెరిగాయి. తరచూ విధించే కర్ఫ్యూలు కనుమరుగయ్యాయి. సామాజిక, భౌతిక మౌలిక సదుపాయాలకు ప్రోత్సాహం లభించింది. ఇవన్నీ సాధించేందుకు ప్రజలతో కలిసి పనిచేయటం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది."

"2014 లోక్ సభ ఎన్నికలకు ప్రధానమంత్రి అభ్యర్థిగా నన్ను 2013లో ప్రకటించారు. ఆ రోజుల్లో దేశం పాలనాపరమైన సంక్షోభంలో ఉంది. అప్పటి యూపీఏ ప్రభుత్వం అవినీతి, కుటుంబపాలన, విధాన పక్షపాతానికి ఉదాహరణగా మారింది. ప్రపంచవ్యాప్తంగా భారత్ బలహీన దేశంగా ఉంది. ఆ సమయంలో దేశ ప్రజలు వివేకంతో ఆలోచించి మా కూటమికి అత్యుత్తమ మెజారిటీని అందించటమే కాక, మూడు దశాబ్దాల తర్వాత తొలిసారిగా మా పార్టీకి సంపూర్ణ మెజారిటీని అందించారు".

"గత 11 ఏళ్లుగా దేశ ప్రజలతో కలిసి అనేక మార్పులు తీసుకువచ్చాం. మనం చేపట్టిన విప్లవాత్మక ప్రయత్నాలు దేశ ప్రజలను.. ముఖ్యంగా మహిళా శక్తిని, యువ శక్తిని, రైతులను సాధికారత దిశగా నడిపించాయి. 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ వెలుగొందుతోంది. ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రతా పథకాలకు ప్రపంచంలోనే అతి పెద్ద నిలయంగా భారత్ అవతరించింది. రైతులు నూతన ఆవిష్కరణలు చేస్తూ, దేశం స్వయం సమృద్ధిని సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్ గా నిలిపేందుకు అన్ని రంగాల్లో విస్తృతమైన సంస్కరణలు చేపట్టాం. ఈ సంస్కరణలు 'ఇది స్వదేశీ అని గర్వంగా ప్రకటిద్దాం' అనే పిలుపుని ప్రతిబింబిస్తాయి."

"మరోసారి దేశ ప్రజలకు, వారు నాపై పెట్టుకున్న నమ్మకం, చూపిన ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మన దేశానికి సేవ చేయడం నాకు అత్యున్నత గౌరవం. ఇది నాకు కృతజ్ఞత, సంకల్పంతో కూడిన కర్తవ్యం. రాజ్యాంగ విలువల ఆధారంగా రాబోయే కాలంలో వికసిత్ భారత్ కలను సాకారం చేసేందుకు నేను మరింతగా కృషి చేస్తాను."

## వికసిత్ భారత్ బిల్డథాన్-2025... విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన

న్యూఢిల్లీ, అక్టోబర్ 9:టల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్ భాగస్వామ్యంతో వికసిత్ భారత్ బిల్డథాన్ -2025 కార్యక్రమాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఉన్న 2.5 లక్షల పాఠశాలలకు చెందిన విద్యార్థుల నుంచి ఈ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. ఇది దేశంలోనే ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొన్న ఆవిష్కరణల కార్యక్రమంగా.. వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా నడిపించే చారిత్రక కార్యక్రమంగా నిలిచింది.

విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలనీ, ఆత్మనిర్భర భారత్‌కు తోడ్పడాలనీ వీడియో సందేశం ద్వారా భారతీయ వాయుసేన టెస్ట్ పైలెట్, ఇస్రో వ్యోమగామి, వికసిత్ భారత్ బిల్డథాన్ బ్రాండ్ అంబాసిడర్ అయిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా కోరారు. 6 నుంచి 12 గ్రేడ్లకు చెందిన విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ఈ బిల్డథాన్ ప్రత్యేక వేదికను అందిస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఆలోచనా.. అది చిన్నదైనా.. పెద్దదైనా.. వికసిత్ భారత్ 2047 సాధించేందుకు తోడ్పడుతుందని వివరించారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి, వాస్తవ సమస్యలను పరిష్కరించే నమూనాలను అభివృద్ధి చేయాలని, లోకల్ ఫర్ ఓకల్‌తో సహా స్వదేశీ సామర్థ్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఫొటోలు, వీడియోల రూపంలో పాఠశాలలు సమర్పించిన ఎంట్రీలను నిపుణుల కమిటీ మూల్యాంకనం చేస్తుంది. విజేతలుగా నిలిచిన బృందాలకు రూ. కోటితో ఏర్పాటు చేసిన నిధి నుంచి బహుమతులు అందుతాయి.

# పోషణ్ మాహ్ ఉన్నతమైన కార్యక్రమం

## -పోషణ్ మా ఉన్నతమైన కార్యక్రమం
## -రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రోఖయా బేగం




చిత్తూరు, అక్టోబర్ 9: స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌తో పాటు 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ ను 2025 సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రోఖయా బేగం పేర్కొన్నారు. స్థానిక చిత్తూరు పట్టణంలోని కొంగారెడ్డిపల్లి నందు గవర్నమెంట్ ఐటి సమీపంలో, సిడిపిఓ కార్యాలయంలో పోషణ్ మాహ్‌ను 2025 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఆ.వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా సభ్యురాలు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నపిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులను లక్ష్యంగా చేసుకుని, ఈ కార్యక్రమం అమలులో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో మంచి పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గర్భిణీలు, పాలు ఇచ్చే తల్లులు, మహిళలు పూర్తి స్థాయిలో పోషకాలు అందే ఆహారం తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టి రేపటి రాబోయే రోజుల్లో బావిభారత పౌరులు అవుతారని పేర్కొన్నారు.

అనంతరం పీడీ వెంకటేశ్వరి మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లాలో అన్నీ చోట్ల చక్కగా పోషణ మాహ్ కార్యక్రమం ద్వారా చక్కటి అవగాహన అందుతుందని, కాబోయే తల్లులు మంచి పోషకాహారం తీసుకుంటూ అనీమియా బారిన పడకుండా ఆహ్లాదకరమైన పరిస్థితులు కల్పించుకోవాలని చెప్పారు. పోషణ్ మాహ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు శ్రీ మంతం, చంటి బిడ్డలకు అన్న ప్రాసన, పోషకాహార ప్రదర్శన వంటి కార్యక్రమాల్లో అతిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుగుణ కుమారి, డిసిపిఓ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్ వైజర్స్.. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.




# గంజాయి మొక్కల స్వాధీనం



ఆదిలాబాద్, అక్టోబర్ 9: వ్యవసాయ పంట క్షేత్రంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్న పంట క్షేత్రాలపై ఆదిలాబాద్ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. రూ. 16 లక్షల విలువైన 160 గంజాయి మొక్కలను ఆదిలాబాద్ రూరల్ పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. డీఎస్పీ ఎల్ జీవన్ రెడమాట్లాడుతూ.. ఆదిలాబాద్ రూరల్ మండలం అసోడ గ్రామ శివారులో ఓ రైతు పంట క్షేత్రాల నడుమ ఎవరికి తెలియకుండా గంజాయి సాగు చేస్తున్నట్టు సమాచారం అందిందని తెలిపారు.

ఈ రోజు ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశాల మేరకు పంట చేనులో సోదాలు నిర్వహించగా మెస్రం భుజంగరావు అనే రైతు కంది పంట క్షేత్రంలో 160 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయని, వీటి విలువ మార్కెట్లో రూ.16 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడు భుజంగరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే గంజాయి సాగు చేసే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆపరేషన్లో కీలకంగా వ్యవహరించిన రూరల్ సీఐ కే. ఫణి ధర్(అఎ ఐ. ఖష్ట్రజీనితి ఆష్ట్రజీతీ), ఎస్సై వీ .విష్ణు వర్ధన్, కానిస్టేబుల్ మంగల్ సింగ్, విఠల్‌ను డీ.ఎస్.పీ జీవన్ రెడ్డి అభినందించారు.

# భద్రతా ఏర్పాట్లు సమీక్ష



మహబూబ్‌నగర్, అక్టోబర్ 9: ఈవీఎం గోదాముల్లో భద్రతాపరమైన లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష అన్నారు. ఈ రోజు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరిచిన గోదామును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదాములో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, యాక్సెస్ కంట్రోల్‌వ్యవస్థలను ఆయన సమీక్షించారు.

సాంకేతిక సిబ్బందితో మాట్లాడి యంత్రాల నిర్వహణ, రికార్డు నిర్వహణ, రోజువారీ పర్యవేక్షణ తెలుసుకున్నారు. ఈవీఎంలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. భద్రతా పరికరాలు ఎల్లప్పుడూ సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని నిర్ధారించుకోవాలన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గోదాములో అగ్ని ప్రమాద నిరోధక పరికరాలు, విద్యుత్‌సదుపాయాలు, రక్షణ గార్డుల విధుల అంశాలను కూడా ఆయన పరిశీలించారు.

ఎన్నికల సామగ్రి భద్రతపై ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు భద్రతా చర్యలు అత్యంత కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎం.డి. హుస్సేన్, శివ కృష్ణ పాల్గొన్నారు.

# వీటి సేవలు మధుర జ్ఞాపకం మాత్రమే!

మక్తల్, అక్టోబర్ 9: సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత వాటికి విలువ తగ్గింది. అలానే రెండు నెలల కిందట వాటి సేవలు నిలిపి వేయడంతో కనుమరుగైంది. ప్రస్తుతం ఒక తరానికి ఇవి మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. నేటి తరానికి ఓ యూట్యూబ్, వెబ్‌లో కనిపించే బొమ్మగా మిగిలింది. అవే తపాల బాక్సు! లేఖలు, పార్శిళు ఒక ప్రాంతం నుంచి మరొ ప్రాంతానికి చేరవేయాలనే తపాలా వ్యవస్థ ఏర్పాటు ఈ రోజు ప్రపంచ తపాలా దినోత్సవం.

భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో 1764-1766 మధ్య ముంబై, చెన్నై, కోల్‌కతాలో మొట్టమొదటి పోస్టాఫీసులు ప్రారంభమయ్యాయి. క్రమంగా పోస్టుబాక్సులుఅనేవి లేఖలు వేయడానికి, అందుకున్న లేఖలను తీసుకుని, ఇతరులకు పంపించడానికి ఉపయోగపడే ఒక ముఖ్యమైన సాధనంగా మారాయి. సెల్ ఫోన్ విస్తృతి, వాట్సాప్‌తదితర సాంకేతిక రోజుల్లో ఒకరి క్షేమసమాచారం మరొకరు తెలుసుకునేందుకు తపాల వ్యవస్థ ఓ పెద్దదిక్కుగా ఉండేది.

ఉత్తరాలు రాసి పోస్ట్ బాక్స్ లో వేస్తే చేరాల్సిన చోటికి తపాలా శాఖ చేరవేసేది. తిరిగి అక్కడి నుండి ప్రత్యుత్తరం వచ్చేది .ఇలా ఒకరినొకరి యోగక్షేమాలు తెలుసుకునేవారు. ప్రత్యుత్తరం కాస్త ఆలస్యమైనా నా ఉత్తరం అక్కడికి చేరిందో లేదో ఎందుకో నాకు తిరిగి ఉత్తరం రాలేదు అని ఆందోళన చెందడం, ఆలోచించడం అప్పట్లో సర్వసాధారణం. ఎందరో ప్రేమికులను కలిపే ఒక వేదికగా కూడా ఉత్తరాలు ఉండేవి. కానీ నేడు ఆ ఉత్తరాలు పోస్ట్ బాక్స్ కనిపించడం లేదు.సాంకేతికత పెరిగిన తర్వాత ఉత్తరాలు రాసుకునే పద్ధతి మానుకున్నారు. సెల్ ఫోన్‌వచ్చిన తర్వాత ఉత్తరాలు రాసుకునే వారి సంఖ్య తగ్గింది. వాట్సాప్ వచ్చిన తర్వాత పూర్తిగా ఉత్తరాల వైపు చూడటం మానేశారు నేటి తరం. దీంతో పోస్టు బాక్సు వినియోగం కనుమరుగైంది!

# రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం ఒక సంస్థ లేదా ప్రభుత్వ బాధ్యత కాదు.. ఇది ప్రతి భారతీయుడి సంకల్పం: రక్షణశాఖ మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 9:"రక్షణ, భద్రత... దేశం మొత్తానికి చెందిన సామూహిక బాధ్యత. రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం ఒక సంస్థ లేదా ప్రభుత్వ బాధ్యత కాదు, ఇది ప్రతి భారతీయుడి సంకల్పం" అని 2025 అక్టోబర్ 7న న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. "దేశంలో రక్షణ తయారీ అవకాశాలు" అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో ప్రపంచ స్థాయి పోటీతత్వం కలిగిన రక్షణ తయారీ వ్యవస్థ నిర్మాణంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చురుకైన భాగస్వాములుగా మారాలని రక్షణమంత్రి పిలుపునిచ్చారు.

రక్షణ రంగంలో స్వావలంబన కేవలం ఉత్పత్తి లేదా ఆర్థిక అంశం మాత్రమే కాదనీ, ఇది ప్రధానంగా మన వ్యూహాత్మక స్వాతంత్ర్యానికి సంబంధించినదనీ, ఇది మన సార్వభౌమత్వానికి అనుసంధానమై ఉందని ఆయన స్పష్టం చేశారు. "ఆపరేషన్ సిందూర్" సమయంలో దేశానికి మాక్ డ్రిల్ అవసరమైనప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని ఆయన గుర్తుచేశారు. "మనమంతా ఒకే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని కలిసి పనిచేస్తే ఏ సవాలైనా చిన్నదే అవుతుంది" అని అన్నారు.

గత దశాబ్ద కాలంలో దేశ రక్షణ తయారీ రంగంలో నెలకొన్న గొప్ప వృద్ధిని రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్ ప్రస్తావించారు. 2014లో రూ. 46,000 కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తి 2025 నాటికి రూ. 1.5 లక్షల కోట్లకు చేరుకుందని చెప్పారు. ఇందులో రూ. 33,000 కోట్ల విలువైన ఉత్పత్తి ప్రైవేట్ రంగం నుంచి వస్తుందని, ఇది ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంలో పరిశ్రమ భాగస్వామ్యం ఎంత ముఖ్యమో సూచిస్తుందని తెలిపారు.

దేశ రక్షణ ఎగుమతులు 2014లో రూ. 1,000 కోట్ల కంటే తక్కువ ఉండగా.. 2025లో రూ. 23, 500 కోట్ల రికార్డు స్థాయి ఎగుమతులు పెరిగాయని కేంద్రమంత్రి తెలిపారు. "ప్రపంచంలో అతిపెద్ద రక్షణ పరికరాల దిగుమతిదారులలో ఒకటిగా ఉండటం నుంచి నమ్మదగిన ఎగుమతిదారుగా మారిన ఈ ప్రయాణం మన జాతీయ సంకల్పానికి నిదర్శనం" అని మంత్రి పేర్కొన్నారు.

**2029 లక్ష్యాలు: అమలులోకి ఆత్మనిర్భర్ భారత్**

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను తెలియజేస్తూ.. 2029 నాటికి దేశంలో రూ. 3 లక్షల కోట్ల విలువైన రక్షణ తయారీ, రూ. 50,000 కోట్ల విలువైన రక్షణ ఎగుమతులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన కేవలం మేక్ ఇన్ ఇండియా లేదా ఎగుమతి గణాంకాల గురించి మాత్రమే కాదనీ, సంక్షోభ సమయాల్లో మనం ఇతరులపై ఆధారపడకుండా మన రక్షణను మనమే నిర్వహించడం ముఖ్యమన్నారు. "మన సాయుధ దళాలు ఉపయోగించే ఆయుధాలు మన సొంత నేలపై తయారవుతున్నాయి. మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల ప్రతిభతో రూపొందుతున్నాయి" అని అన్నారు.

రాష్ట్ర విధానాల సంకలన పత్రం విడుదల.

రక్షణ, అంతరిక్ష తయారీ రంగంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అనుసరిస్తున్న విధానాలు, ఉత్తమ పద్ధతుల సంకలనంగా రూపొందించిన "రాష్ట్ర విధానాల సంకలనం" పత్రాన్ని రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ విడుదల చేశారు . ఈ పత్రం కేంద్ర, రాష్ట్రాల మధ్య విధాన సమన్వయాన్ని మెరుగుపరచడంలో కీలక అడుగుగా కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ఈ సంకలనం పరిశ్రమలు, ఆవిష్కర్తలకు మార్గదర్శక పత్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు దీన్ని అధ్యయనం చేసి, ఉత్తమ పద్ధతులను అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ పత్రం రక్షణ రంగ పెట్టుబడులను ఆకర్షించడంలో, రాష్ట్రాల మధ్య పోటీతో పాటు సహకారాన్ని కూడా ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు.

రక్షణ రంగంలో వ్యాపారాన్ని సులభతరం చేయడానికి చేపట్టిన విస్తృత సంస్కరణలను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. స్వీయ-ధ్రువీకరణ ద్వారా గడువులోగా ఉత్పత్తులను తయారు చేయడం, నిర్ధారణ పరీక్షలను దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తెన్నా కేంద్రీకృతంగా పనిచేసే ఒక పోర్టల్ వంటి వాటిని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ సాయంతో రక్షణ శాఖ ఉత్పత్తులకు పరీక్షించేందుకు డిఫెన్స్ టెస్టింగ్‌న్ఫ్రాస్ట్రక్చర్ పథకాన్ని తెచ్చామనీ, దీని ద్వారా కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం సుసాధ్యం అవుతుందన్నారు.

పెట్టుబడులు, సాంకేతికతల ఆలంబన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి రక్షణ వ్యయ విధానం 2020, రక్షణ సేకరణ మాన్యువల్ 2025, రక్షణ ఆఫ్‌సెట్‌ల విధానం, రక్షణ పెట్టుబడిదారుల సెల్ వంటి విధానాలను రక్షణ మంత్రిత్వ శాఖ నిరంతరం మెరుగుపరుస్తోందని ఆయన పేర్కొన్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ సంస్కరణలు కేవలం నియంత్రణ చర్యలు మాత్రమే కాదని, అవకాశాలను కల్పించే సాధనాలని అన్నారు.

**సాంకేతికత, ఆవిష్కరణల శక్తి వినియోగం**

''ఆధునిక యుద్ధం కేవలం ఆయుధాలపై మాత్రమే ఆధారపడి ఉండదు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల ప్రభావంపై ఆధారపడి ఉంటుంది. భౌతిక పెట్టుబడి కంటే ఆధునిక సాంకేతికతలో మనం మేధోపరమైన పెట్టుబడి పెట్టడం అవసరం" అని రక్షణ మంత్రి తెలిపారు. సాంప్రదాయ బలాన్ని ఆధునిక ఆవిష్కరణలతో కలిపి ప్రపంచ స్థాయి రక్షణ వ్యవస్థలను రూపొందించి, అభివృద్ధి, ఉత్పత్తి చేయగల నవ భారత్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు.

డిజిటల్ మార్పులు, ఎంఎస్ఎంఈలకు మద్దతు

రక్షణ మంత్రిత్వ శాఖ చేపట్టిన డిజిటల్ చర్యలను రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. దేశ రక్షణ పరిశ్రమలు, వారి ఉత్పత్తుల నైపుణ్యాలను మ్యాప్ చేసే డిజిటల్ రిపోజిటరీగా శ్రీజన్ దీప్ (రక్షణ సంస్థలు, పారిశ్రామికవేత్తల వేదిక) అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రక్షణ ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన అనుమతులను సరళతరం చేసే సింగిల్-విండో వేదికలను, డిఫెన్స్ ఎగ్జిమ్ వేదికను కూడా ఆయన ప్రారంభించారు.

లిక్విడిటీ, వర్కింగ్ క్యాపిటల్ సమస్యలను పరిష్కరించేందుకు, పరిశ్రమలకు మద్దతు ఇచ్చేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఆటోమేటెడ్ నగదు నిర్వహణ సాధనాలను అభివృద్ధి చేస్తోంది. ఇది బిల్లుల ప్రాసెసింగ్, చెల్లింపు వ్యవస్థలను సరళతరం చేస్తోంది. ఈ చర్యలు ఎంఎస్ఎంఈలు, అంకుర సంస్థలు, రక్షణ రంగ ఆవిష్కర్తలు సులభంగా, వేగంగా, పారదర్శకంగా వ్యవహరించేందుకు డిజిటల్ మార్గాన్ని అందిస్తున్నాయి. ఇది ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

సమగ్ర సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు

రక్షణ రంగంలో తయారీపరమైన అభివృద్ధికి మించి సామాజిక, మౌలిక సదుపాయాలు, విద్యా రంగాల్లో కూడా మంత్రిత్వశాఖ చేపట్టిన చర్యలను కేంద్రమంత్రి ప్రస్తావించారు. సాయుధ దళాలలో మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు నారీ శక్తి కార్యక్రమం, పరిశ్రమ, ఎంఎస్ఎంఈలు, అంకుర సంస్థలు, విద్యాసంస్థలకు రక్షణ పరిశోధన, అభివృద్ధి బడ్జెట్‌లో 25 శాతం కేటాయించినట్లు చెప్పారు. సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను పెంచడానికి బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బడ్జెట్ విస్తరణ గురించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 33 పాఠశాలలతో పాటు, భాగస్వామ్య నమూనాలో 100 కొత్త సైనిక పాఠశాలల ఆమోదం గురించి కూడా ప్రస్తావించారు. వీటిని ''చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తిని పెంపొందించే" సంస్థలుగా అభివర్ణించారు.

గత 10-11 సంవత్సరాలుగా ప్రభుత్వం రక్షణ రంగంలో అనేక విధాన సంస్కరణలను చేపట్టిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. రక్షణ ఉత్పత్తిలో స్వదేశీ సమాచారాన్ని పెంచడం, రక్షణ పెట్టుబడులను వేగవంతం చేయడం ఈ ప్రయత్నాలకు కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. "ఐడెక్స్, రక్షణ కారిడార్లు, రక్షణ తయారీలో ఎఫ్‌డీఐని ప్రోత్సహించడం వంటి చర్యలన్నీ ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని బలోపేతం చేయడంలో కీలకంగా మారాయి.

రక్షణ భూముల నిర్వహణ అంశంపై కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని రక్షణమంత్రి పిలుపునిచ్చారు. రక్షణ భూమిపై ప్రజా వినియోగ ప్రాజెక్టుల కోసం రాష్ట్రాల ప్రతిపాదనలను సులభతరం చేయడానికి ఒక ఆన్‌లైన్ వేదికను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రాలు ఈ వేదికను సమర్థవంతంగా వినియోగించాలని, అవసరమైనచోట సమానమైన భూమిని అందించడాన్ని వేగవంతం చేయాలని కోరారు. వివిధ రాష్ట్రాల్లో సుమారు 18 లక్షల ఎకరాల రక్షణ భూమి ఉందని, స్థానిక వివాదాలను నివారించేందుకు, భద్రతను నిర్ధారించడానికి సమన్వయ నిర్వహణ అవసరమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల క్రియాశీల భాగస్వామ్యంతో అంతరిక్ష, రక్షణ తయారీని ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం, స్వావలంబన కేంద్రంగా మారాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి మద్దతుగా రక్షణ ఉత్పత్తి శాఖ 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల సంకలనాన్ని సిద్ధం చేసింది. ఇది ఏ అండ్ డీ, పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ, అంకుర సంస్థలు, ఆర్ అండ్ డీ, ఎగుమతులు, రవాణా విధానాలతో సహా రాష్ట్ర స్థాయి విధానాలను ఏకీకృతం చేస్తుంది. ఆర్థిక ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల మద్దతు, వ్యాపార సంస్కరణలను సులభతరం చేయడం, విధాన అమలుపై సమాచారాన్ని కూడా అందిస్తుంది. జాతీయ లక్ష్యాలు, రాష్ట్ర చర్యల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంలో మార్గదర్శక వనరుగా పనిచేస్తుంది. క్రాస్-లెర్నింగ్‌ను ప్రోత్సహిస్తుంది. సాంకేతిక స్వీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి. నైపుణ్యంలో చొరవలపై దృష్టి సారిస్తుంది. వికసిత్ భారత్-2047 దార్శనికతకు మద్దతు ఇస్తుంది.

ఈ పుస్తకం ఐడెక్స్ ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలు, విద్యాసంస్థలు, వ్యక్తిగత ఆవిష్కర్తలు జాతీయ రక్షణ, భద్రతా రంగాల్లో తీసుకువచ్చిన సృజనాత్మకత, సమస్య పరిష్కార స్ఫూర్తిని ప్రదర్శిస్తుంది.

ఏయిరో ఇండియా 2025 సందర్భంగా రక్షణ మంత్రి విడుదల చేసిన ఐడెక్స్ కాఫీ టేబుల్ బుక్ మునుపటి సంపుటిని విస్తరిస్తూ, ఈ పుస్తకం సాయుధ దళాల క్లిష్టమైన అవసరాలను తీర్చడమే కాకుండా, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు అనువైన సాంకేతికతను ప్రదర్శిస్తుంది.

ఈ నూతన వేదిక ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలో అప్లికేషన్ ప్రాసెసింగ్, ఆటోమేటెడ్ కంపెనీ వెరిఫికేషన్, సరళమైన రిజిస్ట్రేషన్, ఓజీఈఎల్ ఫైలింగ్, రియల్ టైమ్ ట్రాకింగ్, సురక్షిత చెల్లింపు వ్యవస్థ సమీకరణను అనుమతిస్తుంది. లైసెన్స్ పొందిన డిఫెన్స్ ఇండస్ట్రీస్ కోసం భద్రతా మాన్యువల్ కింద నవీకరించిన ఎస్ఓపీలు,యు సమ్మతి లక్షణాలకు అనుగుణంగా నిర్మించిన ఈ పోర్టల్.. పారదర్శకత, సామర్థ్యం, నియంత్రణ కట్టుబడిని పెంచుతుంది, ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలను బలోపేతం చేస్తుంది. దేశాన్ని రక్షణ తయారీ ఎగుమతులకు ప్రపంచస్థాయి కేంద్రంగా స్థాపించేందుకు దోహదపడుతుంది.

సరాఫరా వ్యవస్థల్లోని లోపాలను తగ్గించడం, వ్యూహాత్మక స్వాతంత్ర్యం, జాతీయ భద్రత బలోపేతం, ఆత్మనిర్భర్ భారత్ కు మద్దతు ఇవ్వడం దీని లక్ష్యాలు. ప్రతి పరిశ్రమకు అప్‌డేట్స్, ట్రాకింగ్ కోసం ప్రత్యేక సూచన సంఖ్యను కేటాయించారు.

దేశంలో రక్షణ తయారీని పెంచడానికి రక్షణ ఉత్పత్తి శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అవగాహన కల్పించడానికి రక్షణ మంత్రిత్వ శాఖలోని డీడీపీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. త్రివిధ దళాల అధిపతి జనరల్ అనిల్ చౌహాన్, నావికదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, ఆర్మీ అధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది, వైమానిక దళాల అధిపతి మార్షల్ ఏపీ సింగ్, రక్షణ ఉత్పత్తి కార్యదర్శి శ్రీ సంజీవ్ కుమార్, కార్యదర్శి డీడీఆర్ అండ్ కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్, రక్షణ మంత్రిత్వ శాఖ, కేంద్, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అడ్డుకున్న పోలీసులు

అమరావతి, అక్టోబర్ 9:ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు ఈరోజు రోడ్డు పై ధర్నా చేశారు. రాజీవ్ రహదారిపై బైఠాయించి, ప్రభుత్వం వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో రవాణా స్తంభించగా, రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న వెల్గటూరు ఎస్సై ఉమసాగర్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళన కారులను శాంతింపజేశారు.

ఈ సందర్భంగా పోలీసులు, తల్లిదండ్రుల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో మా పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని, పాఠశాల యాజమాన్యాలు పిల్లలను తరగతులకు రానివ్వడం లేదని తల్లిదం డ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్షర హైస్కూల్ యాజమాన్యంతో చర్చించి, ప్రభుత్వం నిధులు విడుదల చేసే వరకు విద్యార్థులను తరగతులకు అనుమతించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వకూడదని స్థానిక ఎంఈఓ ఆదేశించారు.

# ఎస్టీపీతో నీటి కాలుష్యాన్ని తగ్గిస్తాం..

## -చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్



చిత్తూరు, అక్టోబర్ 9: ఎస్టీపీతో నీటి కాలుష్యాన్ని తగ్గిస్తామని చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ గురువారం కట్టమంచి మామిడికాయల మండి ప్రాంతంలో ఏర్పాటు అనుకూలంగా ఉంటుందేమో అని పరిశీలించడం జరిగినది.

సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నగరంలో నీటి కాలుష్యాన్ని తగ్గించడానికి, పర్యావరణాన్ని మెరుగుపరచడానికి సుమారు 34 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారనున్నది. స్థల పరిశీలన కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.పుష్పగిరి నాయక్, ఇంజనీర్ ఎం.ఇ.వెంకటరామి రెడ్డి, ఎసీపీ నాగేంద్ర, ఎంహెచ్వో డా.లోకేష్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అధికారులు, ఇంజనీర్లు, స్థానిక ప్రతినిధులతో ్లాఖ నిర్మాణం, ప్రాజెక్ట్ రోడ్‌మ్యాప్, భవిష్యత్ నిర్వహణ పద్ధతులు గురించి సమగ్రంగా చర్చించారు. కమిషనర్ ప్రసాద్ మాట్లాడుతూ? "చిత్తూరు నగరంలోని నీటి నాణ్యతను పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ హిత విధానాలను అభివృద్ధి చేయడం మా ప్రాధాన్యమన్నారు. ఈ ్లాఖ ప్రారంభం తర్వాత నగరానికి శుభ్రమైన నీరు అందించగలుగుతాం " అని చెప్పారు. ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాత, నగరంలోని గృహాల నుంచి వచ్చే సీవరేజ్ ను సమర్థవంతంగా శుద్ధి చేయడం ద్వారా స్థానిక నదులు, కూల్‌వాటర్ గడ్డలు, పర్యావరణ పర్యవేక్షణకు మేలు జరుగనుందన్నారు.

# ఇండియా మొబైల్ ప్రారంభించనున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 9:ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2025 వరంవరలో 9వ సంచికను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెల 8న ఉదయం సుమారు 9:45 గంటలకు న్యూఢిల్లీలోని యశోభూమిలో ప్రారంభిస్తారు. ఇది ఆసియాలో టెలికం, మీడియా, టెక్నాలజీ రంగాలకు సంబంధించిన భారీ కార్యక్రమం.

'ఐఎంసీ 2025'ని టెలికమ్యూనికేషన్ల విభాగం (డీఓటీ)తో పాటు భారతీయ సెల్యులర్ ఆపరేటర్ల సంఘం (సీఓఏఐ) సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నాయి. ఈ కార్యక్రమ ఇతివృత్తం.. మార్పు దిశగా ఆవిష్కరణలు. డిజిటల్ మార్పుతో పాటు సామాజిక పురోగతిని సాధించడానికి నవకల్పనను వినియోగించు కొనేందుకు భారత్ కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం చాటిచెబుతుంది.

టెలికం రంగంలో అత్యాధునిక మార్పులతో పాటు నరికొత్త సాంకేతికతలను కూడా ఐఎంసీ 2025లో ప్రదర్శిస్తారు. ప్రపంచ దేశాలకు చెందిన ప్రముఖులు, విధాన రూపకర్తలు, పరిశ్రమ నిపుణులతో పాటు ఆవిష్కర్తలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం ఆప్టికల్ కమ్యూనికేషన్లు, టెలికం రంగంలో సెమీకండక్టర్లు, క్వాంటమ్ కమ్యూనికేషన్లు, 6జీ, ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ల వంటి ముఖ్య అంశాలపై దృష్టి సారిస్తుంది. తదుపరి తరం సంధానం- డిజిటల్ సార్వభౌమాధికారం, సైబర్ మోసాల నివారణలతో పాటు గ్లోబల్ టెక్నాలజీ లీడర్ షిప్.. వీటికి భారత్ వ్యూహాత్మకంగా ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఐఎంసీ 2025 చాటబోతోంది. ఈ కార్యక్రమంలో 150కి పైగా దేశాలకు చెందిన 1.5 లక్షల కన్నా ఎక్కువ మంది సందర్శకులు, 7,000 కన్నా ఎక్కువ మంది ప్రతినిధులు, 400 కన్నా ఎక్కువ వాణిజ్య సంస్థలు పాల్గొంటాయని భావిస్తున్నారు. 100కు పైగా సదస్సులలో 800 కన్నా ఎక్కువ వక్తలు పాలుపంచుకొనే ఈ కార్యక్రమంలో.. 5జీ, 6జీ, ఏఐ, స్మార్ట్ మొబిలిటీ, సైబర్ భద్రత, క్వాంటమ్ కంప్యూటింగ్, హరిత ప్రధాన సాంకేతికత తదితర రంగాల్లో 1,600 కన్నా ఎక్కువ సరికొత్తగా ఉపయోగంలోకి తీసుకువచ్చిన పరికరాలను పరిచయం చేస్తారు. అంతర్జాతీయ సహకారంపైన కూడా ఐఎంసీ 2025లో ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఈ కార్యక్రమంలో జపాన్, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, రష్యా, ఐర్లండ్‌లతో పాటు ఆస్ట్రియా ప్రతినిధి వర్గాలు పాల్గొంటాయి.

# అంతర్జాతీయ సదస్సులో తుడా చైర్మన్

## -స్వర్ణాంధ్ర గ్రీన్ ఆంధ్ర చంద్రబాబు, లోకేష్ ల లక్ష్యం

తిరుపతి, అక్టోబర్ 9:ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ ప్రతినిధుల సదస్సులో తెలుగుదేశం (ఎశ్రీబీణబీ ఆఐబజీఏ) పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టిటిడి కో- ఆప్షన్ సభ్యులు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన అరైజ్ సిటీస్ ఫోరం 2025 లో తిరుపతి తుడా చైర్మన్ హోదాలో స్పీకర్‌గా డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. భారత గృహ పట్టణ వ్యవహారాల శాఖ, ఐసిఎల్ఈఐ సౌత్ ఏషియా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ కార్యక్రమంలో 20కిపైగా దేశాల నాయకులు, మేయర్లు, నగర కమిషనర్లు, ప్రపంచ బ్యాంకు, ఏడిబి, యూఎన్, ఎన్ఐయూఏ, ఐసిఎల్ఈఐ వంటి గ్లోబల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వర్ణాంధ్ర, గ్రీన్ ఆంధ్ర లక్ష్యంతో ముందుకు సాగుతుం దన్నారు. తిరుపతిలో తుడా చేపడుతున్న స్మార్ట్ సిటీ ప్లానింగ్, హీట్ రెసిలిన్స్ సస్టైనబిలిటీ ప్రాజెక్ట్స్ గురించి వివరించారు. తిరుపతి స్మార్ట్ విజన్ ప్రపంచ వేదికపై ప్రతిధ్వనించిందన్నారు. తిరుపతి తుడాను ప్రపంచ పటంలో నిలపడమే ధ్యేయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ల ఆశయ సాధన కోసం కృషి చేస్తానన్నారు.

# ప్రశంసా పత్రాలు అందజేసిన కలెక్టర్..



విజయవాడ, అక్టోబర్ 9: దసరా మహోత్సవాలలో రెడ్ క్రాస్ సంఅందించిన సేవలు ప్రశంసనీయమైనవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఉ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన రెడ్ క్రాస్ వాలంటీర్ల అభినందన సభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ.. దసరా మహోత్సవాలలో వృద్ధులకు, దివ్యాంగులకు రెడ్ క్రాస్ వాలంటీర్లు మంచి సేవలు అందించారని చెప్పారు.

ఉత్సవాలు 11 రోజులపాటు జరిగినా, లక్షలాది భక్తులు హాజరైనా రెడ్ క్రాస్ వాలంటీర్లు అలుపెరగకుండా రాత్రింబవళ్లు పనిచేశారని చెప్పారు. ఉత్సవాలు విజయవంతంగా ముగియడంలో రెడ్ క్రాస్ పాత్ర కూడా ఉందన్నారు. ఇదే సేవాభావంతో భవిష్యత్తులో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని సూచించారు. ఉత్తమ సేవలు అందించిన రెడ్ క్రాస్ వాలంటీర్లకు జిల్లా కలెక్టర్ అభినందన పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్యులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. సమరం మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మార్గదర్శకత్వంలో అద్భుతంగా సేవలందించగలిగామని చెప్పారు. ఒక షిఫ్ట్ కు 20 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో రోజుకు 60 మంది విద్యార్థులు అమ్మవారి భక్తులకు సేవలందించారని చెప్పారు. కేబీఎన్, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ ఫార్మసీ కళాశాలల యూత్ రెడ్ క్రాస్ విభాగాల విద్యార్థులు ఈ ఉత్సవాలలో పాల్గొన్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఇ.చిట్టిబాబు, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, కేబీఎన్ కళాశాల, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలల రెడ్ క్రాస్ యూత్ వింగ్ వాలంటీర్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

# పీపీపీ విధానం బెస్ట్

## -మంత్రి పయ్యావుల కేశవ్



అమరావతి, అక్టోబర్ 9: మెడికల్ కళాశాలలో పీపీపీ విధానంపై మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. అనంతపురంలో జీఎస్టీ అమలు విధానం గురించి నగరంలోని పలు మెడికల్ స్టోర్ లను సందర్శించి అవగాహన కల్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జీఎస్టీని పలు అంశాలపై తగ్గింపు చేసి వినియోగదారులకు భారీగా ఊరట కల్పించే దిశలో అమలు చేసిన నేపథ్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమం పేరుతో నెల పాటు ఒక బృహత్తర కార్యక్రమం రాష్ట్రంలో చేపట్టి వివిధ వర్గాల ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు.

రాష్ట్రంలో పలు ప్రజోపయోగ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ ప్రభుత్వం తమ ఎన్డీఏ కూటమి ప్రభుత్వమన్నారు. మెడికల్ కాలేజీల అంశం మోడల్.. జగన్ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారు. ప్రజలకు ఏది అవసరమో, ఏది సమంజసమో వాటిని అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రపంచం మొత్తం మన దేశం వైపు చూస్తోంది. చంద్రబాబు నాయుడు ఒక విజనరీ నాయకుడన్నారు.

ప్రజలకు సేవ చేసే ఒక కూలీలా పని చేస్తున్న నిజమైన నాయకుడు మన ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి రోజూ ప్రజలకు ఎంతో మేలు చేసే ఏదో ఒక కార్యక్రమం చేస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ కాపాకోవడం, విశాఖ రైల్వే జోన్, జీఎస్టీ తగ్గింపు వంటి పలు కార్యక్రమాలు చేసుకోగలుగుతున్నాం. ఇవన్నీ చంద్రబాబు నాయుడు చొరవ వలన జరుగుతున్నాయి. ఆర్డీటీ జిల్లాలో ఒక ఎన్జీఓ. ఎఫ్.సి.ఆర్.ఐ రెన్యూవల్ కోసం సీఎం రెండు సార్లు చర్చించారు. వ్యక్తిగతంగా టేకప్ చేశారు. మొన్న జరిగిన సమావేశంలో హోంమంత్రి తో మాట్లాడారు. తొందరలోనే ఒక పాజిటివ్ వార్త వస్తుందన్నారు.

# నైతికత, వారసత్వం, ఆధునిక ఏఐ విజన్.. ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 లోగో

న్యూఢిల్లీ, అక్టోబర్ 9:ఫిబ్రవరి 19 నుంచి 20వ తేదీ వరకూ న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగబోయే ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్- 2026 లోగోను భారత ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించింది.

మే 28 నుంచి జూన్ 12, 2025 వరకు మైగవ్ వేదిక ద్వారా నిర్వహించిన లోగో డిజైన్ పోటీ ద్వారా ఈ సమ్మిట్ కు లోగోను ఎంపిక చేశారు. తుది ఎంట్రీలను ఎమర్జింగ్ టెక్నాలజీస్ బృందం, ఎంఈఐటీవై పరిశీలించి.. విజేతను ఎంపిక చేసింది. మై గవ్ కు మొత్తం 599 ఎంట్రీలు రాగా, శ్రీ అజిత్ పి.సురేశ్ రూపొందించిన లోగో పోటీలో ఎంపికైంది.

మానవాళి శ్రేయస్సుకు బాధ్యతయుతమైన ఏఐ ఆవిష్కరణలో ప్రపంచానికి నాయకత్వం వహించాలనే భారత్ ఆశయాన్ని ఎంపికైన లోగో డిజైన్ ప్రతిబింబిస్తుంది. దాని మధ్యలో ఉన్న అశోక చక్రం.. నైతిక పాలన, న్యాయం, భారత డిజిటల్ ప్రయాణానికి ఆధారమైన రాజ్యాంగ విలువలను సూచిస్తుంది.

"లోగో మొదటి డిజైన్ ను 23 గంటల్లో రూపొందించాను. తర్వాత ఏఐ ప్రాధాన్యతను తెలియజేసేలా దాన్ని మెరుగుపరిచాను. అందులోని ప్రకాశవంతమైన కాంతిరేఖలు ప్రపంచానికి భారత దార్శనికత విస్తృతం కావటాన్ని సూచిస్తాయి" అని ఆయన అన్నారు. బయటకు ప్రసరిస్తున్నట్లుగా ఉన్న న్యూరల్ నెట్‌వర్క్ ఫ్లేర్స్, ఏఐ పరివర్తన శక్తిని, సమగ్ర అభివృద్ధికి భాషలు, రంగాలు, పరిశ్రమలు, భౌగోళిక విభాగాలను సూచిస్తాయి.

లోగో అంతటా ఉన్న రంగుల కలయిక... ఆవిష్కరణ, సమ్మిళిత్వాన్ని సూచిస్తుంది. ఇది ఏఐ విప్లవంలో భాగమైన దేశంలోని విభిన్న పరిశ్రమలు, సంస్కృతులు, సమాజాలను తెలియజేస్తుంది. ఇందులోని రంగులు.. అశోక చక్రం విలువలను ప్రతిఫలిస్తున్నాయి.

ఈ చిహ్నాల రూపకల్పనకి తోడుగా స్పష్టంగా, ఆధునికతతో తీర్చిదిద్దిన అక్షరాలు స్పష్టతను, విశ్వాసాన్ని ఇస్తాయి. దీని ద్వారా డిజిటల్, ప్రింట్ ప్లాట్‌ఫామ్‌లలో ఇది సులభంగా గుర్తుండేలా, అనుకూలంగానూ ఉంటుంది.

ఆధునికతతో కూడిన సంప్రదాయం, నైతిక ఆవిష్కరణ, భారతదేశ జాతీయ గుర్తింపుని ప్రపంచ ఆశయాలతో ఏకం చేస్తూ, ఇండి యా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 స్ఫూర్తిని ఈ లోగో తెలుపుతుంది. సమగ్రాభివృద్ధినీ, స్థిరత్వాన్నీ, పురోగతినీ పెంపొందించడంలో ఏఐ కీలక పాత్రను ప్రదర్శించడానికి ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ ఆతిథ్యమిస్తున్న- ఈ ప్రపంచ వేదిక సిద్ధమైంది. మానవాళికి ఏఐ చేసే సేవ, సమగ్రాభివృద్ధి, సామాజిక వృద్ధి, పర్యావరణాన్ని పరిరక్షించే ఆవిష్కరణలను ప్రోత్సహించే మార్గాన్ని ఈ సమ్మిట్ నిర్దేశిస్తుంది.



# ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభం




హైదరాబాద్ అక్టోబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణ రాష్ట్రంలో ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలి విడత ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇవాల్టి నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 11 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. తొలి విడతలో 292 జడ్పిటిసిలు, 2964 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఎంపిటిసి, జెడ్పిటిసి, ఎన్నికల తొలివిడత నామినేషన్లు నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 9, స్వీకరణకు చివరి తేదీ అక్టోబర్ 11, పరిశీలన: అక్టోబర్ 12 నామినేషన్ల ఉపసంహరణ– :అక్టోబర్ 15 ఎన్నికల తేదీ– :అక్టోబర్ 23 ఓట్ల లెక్కింపు– : నవంబర్ 11 ఉదయం 8 గంటలకు ప్రారంభం మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపిటిసి, జెడ్పిటిసి, మిగతా మూడు దశల్లో గ్రామ వంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎంపిటిసి, జెడ్పిటిసిలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ వంచాయతీల ఓట్ల లెక్కింపు చేవడతారు. నవంబర్ 11న ఎంపిటిసి, జెడ్పిటిసి ఓట్ల లెక్కింపు జరుగనుంది. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపిటిసి, 565 జెడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల రెండో విడత నామినేషన్లు: రెండో విడత నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13 స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15 పరిశీలన: అక్టోబర్ 16 నామినేషన్ల ఉపసంహరణ :– అక్టోబర్ 19 ఎన్నికల తేదీ– : అక్టోబర్ 27 ఓట్ల లెక్కింపు– : నవంబర్ 11 ఉదయం 8 గంటలకు ప్రారంభం

హైదరాబాద్ అక్టోబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణ రాష్ట్రంలో ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలి విడత ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇవాల్టి నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 11 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. తొలి విడతలో 292 జడ్పిటిసిలు, 2964 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఎంపిటిసి, జెడ్పిటిసి, ఎన్నికల తొలివిడత నామినేషన్లు నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 9, స్వీకరణకు చివరి తేదీ అక్టోబర్ 11, పరిశీలన: అక్టోబర్ 12 నామినేషన్ల ఉపసంహరణ– :అక్టోబర్ 15 ఎన్నికల తేదీ– :అక్టోబర్ 23 ఓట్ల లెక్కింపు– : నవంబర్ 11 ఉదయం 8 గంటలకు ప్రారంభం మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపిటిసి, జెడ్పిటిసి, మిగతా మూడు దశల్లో గ్రామ వంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎంపిటిసి, జెడ్పిటిసిలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ వంచాయతీల ఓట్ల లెక్కింపు చేవడతారు. నవంబర్ 11న ఎంపిటిసి, జెడ్పిటిసి ఓట్ల లెక్కింపు జరుగనుంది. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపిటిసి, 565 జెడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల రెండో విడత నామినేషన్లు: రెండో విడత నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13 స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15 పరిశీలన: అక్టోబర్ 16 నామినేషన్ల ఉపసంహరణ :– అక్టోబర్ 19 ఎన్నికల తేదీ– : అక్టోబర్ 27 ఓట్ల లెక్కింపు– : నవంబర్ 11 ఉదయం 8 గంటలకు ప్రారంభం

# రాజన్న సిరిసిల్లలో ఆగిన ఎన్నికల హడావిడి.!

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 9:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్లలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది . స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే రావడంతో ఎన్నికల హడావుడి ఒక్కసారిగా ఆగిపోయింది. ఇప్పటికే అభ్యర్థుల ఎంపికలు, పార్టీ పొత్తులు, సోషల్ మీడియాలో ప్రచారాలు ఉధృతంగా సాగుతున్న సమయంలో వచ్చిన ఈ నిర్ణయం రాజకీయ నాయకులకు షాక్ గా మారింది.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత గ్రామాల్లో రాజకీయ చర్చలు వేడెక్కాయి.

ఎవరు పోటీ చేస్తారు.. ఎవరు మద్దతు ఇస్తారు.. అనే చర్చలతో ప్రతి గ్రామం ఉత్సాహంగా మారింది. కానీ హైకోర్టు ఆదేశాలతో ఒక్కసారిగా ఆ ఉత్సాహం చల్లారిపోయింది.ప్రత్యేకంగా బీసీ వర్గాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. “ఎన్నికలు వాయిదా వేయడం వల్ల మన హక్కులు దెబ్బతింటున్నాయి” అని పలువురు బీసీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. రిజర్వేషన్ల అంశం ఇంకా తేలకపోవడం వల్ల రాజకీయ వాతావరణం స్పష్టత కోల్పోయింది.

ఇప్పుడు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో, ఎలా ఉంటాయో అనే సందేహంలో ప్రజలు ఉన్నారు. “రిజర్వేషన్ల సమస్య తీరిన తర్వాతే ఎన్నికలు జరుగుతాయని” అధికారులు చెబుతున్నా, ప్రజల్లో మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది.

గ్రామాల్లో ప్రచార వాహనాలు, ఫ్లెక్సీలు, పార్టీ సమావేశాలు ఒక్కసారిగా ఆగిపోవడంతో ఎన్నికల ఉత్సవం మధ్యలో నిలిచిపోయినట్లైంది.

రాబోయే రోజుల్లో హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందన్నదే ఇప్పుడు అందరి చూపు.మొత్తానికి – రిజర్వేషన్ల వివాదంతో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటంతో, రాజన్న సిరిసిల్లలో రాజకీయాల్లో మళ్లీ ఉత్కంఠ పెరిగింది. కోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఈ సందిగ్ధం( అర్థం కాని పరిస్థితి) కొనసాగే అవకాశం ఉంది.

# చేనేత సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమం : మాచర్ల మోహన్ రావు



నల్గొండ, అక్టోబర్ 9:చేనేత సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని చేనేత జన సమాఖ్య జాతీయ అధ్యక్షుడు మాచర్ల మోహన్ రావు పిలుపునిచ్చారు. గురువారం భూదాన్ పోచంపల్లిలో జిల్లా చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు, చేనేత సంస్థల ప్రతినిధులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రుణ మాఫీని చేస్తామని ప్రకటించి 13 నెలలు గడిచినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. రుణమాఫీ కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాలపై జీరో జీఎస్టీ విధానాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. చేనేత సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని, సంఘాల్లో పేరుకుపోయిన వస్త్ర నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

నేసిన వస్త్రాలకు సరైన మార్కెటింగ్ లేక, కార్మికులకు ఉపాధి దొరకక అప్పుల బాధతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఉద్యమాలతో హక్కులు సాధించుకోకపోతే మనుగడ సాధ్యం కాదన్నారు. చేనేత రుణమాఫీ, జీరో జీఎస్టీ అంశాలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం నాయకులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత రాష్ట్ర నాయకులు తడక యాదగిరి, తడక రమేశ్, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత వాసుదేవ్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, నాయకులు ఎన్నం శివకుమార్, చిక్క కృష్ణ, గంజి బసవలింగం, మంగళపల్లి శ్రీహరి, బోడ దయానంద్, కటకం శ్యాంసుందర్, చింతకింది దామోదర్, వేముల పాండు, ముసుకూరి నరసింహ, నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుడు సయ్యద్ అబ్దుల్ కరీం కుటుంబాన్ని పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి (ఇస్లాం నగర్) బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అబ్దుల్ కరీం సతీమణి సయ్యద్ అలీమా (38)గుండెపోటుతో మరణించగా, వారి భౌతిక కాయానికి బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి నివాళులు అర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆయన వెంట నాంపల్లి శివరాత్రి శ్రీను , డాక్టర్ వాసాల శ్రీను,కోరే రవి, పత్తెమ్ మల్లేశం ,అషిఫ్ పాషా, సలీం , అలి , గోరేమియా, అబ్దుల్ రహమాన్, తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీ విషయంలో బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు...

**-కేసీఆర్ పదేళ్ల పాలనా కాలంలో ఆర్టీసీని సర్వనాశనం చేశారు...**
**-నగరంలో కాలుష్యం తగ్గింపు మొత్తం ఎలక్ట్రిక్ బస్సుల కోసమే చార్జీల పెంపు**
**-ఆర్టీసీ మరింత బలోపేతం కోసమే చార్జీల పెంపు**
**- ప్రభుత్వ వైఖరిని ప్రజలు, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు గమనించాలి..**
**-కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్**



హైదరాబాద్ అక్టోబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఛలో బస్ భవన్ అంటూ బీఆర్ఎస్ నేతలు హడావిడి చేయడం హాస్యాస్పదం... ప్రజా క్షేత్రంలో ఉనికి కోసమే బీఆర్ఎస్ నాయకులు నాటకాలు వేస్తున్నారు... తమ పదేళ్ల కాలంలో బందలు, ధర్నాలు, నిరసనలపై ఉక్కుపాదం మోపిన వారికి చలో బస్ భవన్ అంటూ పిలుపునిచ్చే హక్కు లేదు.. ఆర్టీసీ విషయంలో బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు... కేసీఆర్ పదేళ్ల పాలనా కాలంలో ఆర్టీసీని సర్వనాశనం చేశారు... బస్ భవన్‌కు బయలుదేరే ముందు కేసీఆర్ ముక్కు నేలకు రాసి ఆర్టీసీ సిబ్బంది, కార్మికులకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డిమాండ్ చేసారు. గురువారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ గత పాపాలకు బీఆర్ఎస్ నేతలంతా ఆర్టీసీ కార్మికుల కాళ్లు కడిగి నెత్తిన చల్లుకోవాలి... ఆర్టీసీ ఎంత మాత్రం మనుగడ సాగించదని... దానిని ప్రైవేటుపరం చేయాలని కేసీఆర్ ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడు పలుమార్లు ప్రకటించారు.. ప్రత్యేక రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సైతం ఆర్టీసీని ప్రైవేటుపరం చేసేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేశారు.. ఆర్టీసీ ఆస్తులను కాజేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారు.. ఆర్మూర్‌లో బీఆర్ఎస్ నాటి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకొని షాపింగ్ కాంప్లెక్స్ కట్టి రూ.7.50 కోట్లను ఆర్టీసీకి ఎగవేశారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం జీవన్‌రెడ్డి అరాచకాలకు అడ్డుకట్ట వేసింది.

కేసీఆర్ పదేళ్ల పాలనా కాలంలో మూడుసార్లు భారీ ఎత్తున ఆర్టీసీ ఛార్జీలు పెంచిన విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు మరిచిపోయారా? బీఆర్ఎస్ హయాంలో మూడేళ్లకోసారి ఆర్టీసీ ఛార్జీలు పెంచారు... 2016 జూన్ 27న ఆర్టీసీ ఛార్జీలను 8.78 శాతం పెంచారు... 2019లో సమ్మె ముగిసిన రోజే ఆర్టీసీ ఛార్జీలను 26.26 శాతం పెంచారు.. నాడు కిలోమీటర్‌కు 20 పైసలు చొప్పున ఛార్జీలు పెంచి ప్రయాణికులపై పెనుభారం మోపారన్నారు.. 2022 జూన్ 09న ఆర్టీసీ ఛార్జీలను 20.51 శాతం పెంచారు... తమ హయాంలో మూడుసార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచడంతో పాటు కార్మికులు, సిబ్బంది విషయంలో దురుసుగా ప్రవర్తించిన నీచ చరిత్ర బీఆర్ఎస్‌ది... మూడుసార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీలో కొత్త బస్సులు కొన్నది లేదు. మౌలిక వసతులు మెరుగుపర్చింది లేదు.... నగరంలో కాలుష్యం తగ్గింపునకు మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు (ఈవీలు) నడపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకు హైదరాబా? నగరంలో కేవలం 265 మాత్రమే ఈవీలుంటే వచ్చే మూడు నెలల్లో మరో 275 ఈవీలు రానున్నాయి...వచ్చే మూడేళ్లలో హైదరాబాద్ నగరంలో డీజిల్ ఆర్టీసీ బస్సే ఉండదు.. 2,800 ఈవీలు వస్తాయి.. వీటితో శబ్ద, వాయు కాలుష్యం తగ్గిపోతుంది.. తాజాగా ఆర్టీసీ గ్రీన్ ఫీతో కేవలం రూ.5 నుంచి రూ.10 మాత్రమే వసూలు చేస్తోంది. ఈ గ్రీన్ ఫీతో రెండేళ్లలో ఆర్టీసీకి రూ.220 కోట్లు వస్తాయని అంచనా వేసింది. ఎలక్ట్రిక్ బస్సులు నడపాలంటే డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్లు, ఆ స్టేషన్లకు హైటెన్షన్ లైన్‌తో పవర్ కనెక్షన్ ఉండాలి.. ఒక్కో ఛార్జింగ్ స్టేషన్, హైటెన్షన్ కనెక్షన్ కు రూ.10 కోట్లు ఖర్చు అవుతుంది.. గ్రీన్ ఫీతో వచ్చే మొత్తాన్ని ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, హెచ్‌టీ లైన్ల కనెక్షన్‌కు వినియోగిస్తారు.. హైదరాబాద్‌లో ఆర్టీసీలో రోజుకు సగటున 24 లక్షల 37 వేల 418 మంది ప్రయాణిస్తున్నారు. అందులో 18 లక్షల 28 వేల 063 మంది మహిళలు.. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం (మహిళలకు ఉచిత ప్రయాణం) అమలు చేస్తుండడంతో మహిళలంతా ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు.. వారు టిక్కెట్ల ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. అంటే గ్రీన్ ఫీకింద ఆర్టీసీ వసూలు చేసే మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నెమ్మదిగా లాభాలబాట పడుతోంది. ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది ఎంతో సంతోషంగా ఉన్నారు.. ఈ సమయంలో ఆర్టీసీని బద్నాం చేసే ప్రయత్న బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.. ఆర్టీసీని నాశనం చేయడమే బీఆర్ఎస్ లక్ష్యం... ఇందుకు వంద సాక్ష్యాలు మేం చూపుతాం... తమ సమస్యలు పరిష్కరించాలంటూ 2019 సంవత్సరంలో ఆర్టీసీ కార్మికులు 53 రోజులు సమ్మె చేస్తే నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ సమ్మెపై ఉక్కుపాదం మోపారు. ఆర్టీసీ కార్మికులను, కార్మిక సంఘాల నాయకులను ఘోరంగా అవమానించారు.. సమ్మె అంటే సస్పెండే అంటూ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కేసీఆర్ ప్రకటనలు చేశారన్నారు. కార్మిక సంఘాలను పరిగణనలోకి తీసుకోలేదు.. కార్మిక సంఘాలపై అడ్డగోలు వ్యాఖ్యలు చేశారు. 2019 సమ్మె సమయంలో కేసీఆర్ మొండి వైఖరి... నాటి మంత్రుల మూర్ఖపు వాదనలతో ఆర్టీసీ డ్రైవర్లు ఆవుల నరేష్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీసీ కండక్టర్ సురేందర్ గౌడ్ ఆత్మహత్యలు చేసుకున్నారు. రాణిగంజ్ డిపోలో కండక్టర్‌గా పని చేసే సురేందర్ గౌడ్ 2018లో తన బిడ్డ పెళ్లికి బ్యాంకు లోన్ తీసుకున్నారు... 2019 సమ్మె సమయంలో సెప్టెంబర్ నెల జీతం ఇవ్వకపోవడం... ఈఎంఐకు సంబంధించిన చెక్కు బౌన్స్ అవడంతో ఒత్తిడికి గురై సురేందర్ గౌడ్ ఉరి పెట్టుకొని చనిపోయారు... ఉద్యోగం నుంచి తొలగిస్తామనే కేసీఆర్ మాటతోనే సురేందర్ గౌడ్ కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డారని సురేందర్ గౌడ్ భార్య నాడు చెప్పారు.. ఈ విషయం తప్పని కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు అనగలరా..? ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోరుతూ ఖమ్మంకు చెందిన డ్రైవర్ శ్రీనివాసరెడ్డి ఒంటికి నిప్పంటిచుకోని ఆత్మహత్య చేసుకున్నారు..తన ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని శ్రీనివాస్ రెడ్డి లేఖ రాశారు.. సమ్మె సమయంలో వరుసగా రెండు నెలలు జీతం ఇవ్వకపోవడంతో మహబూబాబాద్ డిపో పరిధిలో డ్రైవర్ ఆవుల నరేశ్ పురుగుల మందు తాగి చనిపోయారు.. ఆ సమయంలో అనేక మంది ఆత్మహత్యాయత్నాలు చేశారు.. పలువురు ఆందోళనలతో వ్యాధులబారిన పడ్డారు.... వీటన్నింటికి బీఆర్ఎస్ నాయకులు ఏం సమాధానమిస్తారు.. సమ్మె పేరెత్తితేనే డిస్మస్ చేస్తామంటూ కేసీఆర్ నాడు ఆర్టీసీ సిబ్బందిని, కార్మికులను బెదిరించారు.. చివరకు వారిని తొలగించితాత్కాలిక ఉద్యోగులతో బస్సులు నడిపించారు.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజ్‌భవన్‌లో కలిసినప్పుడు దయ చూపమంటే చూపానంటూ చెప్పారు.. ఆర్టీసీ ఆస్తులు కాజేయడం.. సమ్మె చేసినందుకు ఆర్టీసీ సిబ్బంది, కార్మికుల ప్రాణాలు బలిగొనడం.. ఆర్టీసీని అమ్మే ప్రయత్నం చేయడం వంటి పనులు చేసిన బీఆర్ఎస్ నాయకులు ఏముఖం పెట్టుకొని ఛలో బస్ భవన్ అంటున్నారు... బీఆర్ఎస్ హయాంలో ఆర్టీసీ అప్పులబారిన కూరుకుపోయింది... ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. మహిళా టిక్కెట్ల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుండడంతో ఆర్టీసీకి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తోంది. తమ తప్పులకు, పాపాలకు క్షమాపణ చెప్పిన తర్వాతే బీఆర్ఎస్ నేతలు చలో బస్ భవన్‌కు బయలుదేరాలి. ఆర్టీసీ విషయంలో బీఆర్ఎస్ బూటకపు వైఖరిని ప్రజలు, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు గమనించాలి..

# మైక్రో ఇండస్ట్రీస్ కమిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌ను ప్రారంబించిన ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్ అక్టోబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మేడ్చల్ మండలం, రావల్కోల్‌లో గీత నగర్, నవ జీవన్ నగర్ మైక్రో ఇండస్ట్రీస్ కమిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ను మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వమైనా కేంద్ర ప్రభుత్వమైన ఆరాటపడుతుంది ఎంప్లాయిమెంట్ జనరేషన్ కోసం. గతంలో కేంద్ర ప్రభుత్వ పరంగా ఎప్పుడూ కూడా సపోర్టివ్ స్కీమ్స్ ఉండేవి లేదా రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా స్కీమ్ పెడితే దానికి సపోర్ట్ గా ఉంది తప్ప నేరుగా కేంద్ర ప్రభుత్వం ఏ స్కీమ్ పెట్టలేదు. మోడీ గారు పేదరికం నుండి వచ్చిన వ్యక్తి కాబట్టి అనేక రకాల స్కీములు పెట్టారు. ప్రభుత్వపరంగా, ప్రైవేటుపరంగా ఎంప్లాయిమెంట్ జనరేషన్ కోసం 4 లక్షల కోట్ల రూపాయలను 2024-25 బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం పెట్టిందన్నారు. భూలోకంలో అత్యధికంగా యువశక్తి కలిగిన దేశం భారతదేశం. ఏ రంగంలోనైనా యువశక్తిని ఇన్వాల్వ్ చెయ్యకపోతే రాష్ట్రమైన, దేశంమైన పురోగమించే ఆస్కారం లేదు. 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ నేడు మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. యధా రాజా తథా ప్రజా అంటారు. దేశం నడిపే పాలకులు ఎలా ఉంటే దేశం అలా ఉంటది కాబట్టి మన పాలకులకు కమిట్మెంట్, తపన ఉందన్నారు.. మన దేశం త్వరలోనే మొదట ఆర్థిక వ్యవస్థగా నిర్వాలని కోరుకుంటు న్నాను.ఈ ప్రాంతంలో మీ ఇండస్ట్రీస్ గొప్పగా ఎదగాలని, మరింత ముం దుకు పోవడంలో మా పాత్ర కూడా ఉంటుందని మనవి చేస్తూ మీకు శుభం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.ఈ కార్యక్రవ ంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంఎస్ఎంఈ ఇ జేడీ శివ శేషగిరి రావు, గోపాల్, ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, నరేంద్ర చారి, విక్రమ్ రెడ్డి, బుద్ధి శ్రీనివాస్, రాజి రెడ్డి, సతీష్ సాగర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నోలోతపాల దినోత్సవ వేడుకలు



కరీంనగర్, అక్టోబర్ 9: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో గురువారం తపాల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి నరేందర్ రెడ్డి ఆత్మీయ అతిథిగా విచ్చేసి తపాల కార్యాలయం సందర్శించారు.వారు మాట్లాడుతూతపాల సేవలు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని, ఈ సేవల ద్వారా ఎన్నో అవసరాలు తీరుతాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. ఎంతో పురాతన కాలం నుండి తపాల సేవలు కొనసాగుతున్నాయని, చాలామందికి అనేక లాభాలు జరుగుతున్నాయని వారు చెప్పారు. ఆధారంగా భావిస్తారని, ఈ సేవల ద్వారా ఎన్నో అవసరాలు తీరుతుంది అని చెప్పడంలో ఎటువంటి సంశయం లేదనన్నారు. ప్రపంచాన్ని సామాజిక ఆర్థిక అభివృద్ధి పాత్రలో గొప్పగా వ్యవహరిస్తుందని, ప్రజలకు వారి జీవితంలో తపాల సేవలో అందించే సేవలను చక్కగా తెలియ పరిచారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునేటువంటి ఈ వేడుక ద్వారా ప్రతి ఒక్కరు తపాలా ఉద్యోగులను గౌరవించి వారు అనుసరిస్తున్న విధానాన్ని గౌరవించాలని వారు కోరారు. వేడుకల సందర్భంగా కొత్తపల్లి లోని తపాలా కార్యాలయాన్ని సందర్శించి, సబ్ పోస్ట్ మాస్టర్ సంపత్ కుమార్ కి, పర్యవేక్షకులకు, పోస్టల్ సిబ్బందికి జ్ఞాపికలను ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాల ఎస్జీటీకి శైలజకు సత్కారం




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం నాంపల్లిలో ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న సింగిరెడ్డి శైలజ జిల్లా స్థాయిలో జరిగిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ మేలాలో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సదానందం, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ బన్నాజీ, పాఠశాల హెచ్ఎం వత్సల, ఉపాధ్యాయులు ఉమాదేవి, రజిత, వినయ్ కుమార్, కమలాకర్ రెడ్డి, సనాలు శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్సే కాంపిటీషన్



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ లయన్స్ క్లబ్, వేములవాడ రాజన్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం శ్రీ సరస్వతి మందిర్ లో ఎస్సే కాంపిటీషన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా బాలబాలికలతో డాక్టర్ ప్రవీణ్ ప్రముఖ సైకాలజిస్ట్ చే అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల జ్ఞాపకశక్తి పోటీ కాంపిటీషన్లో ఎదుర్కొనే పలు సూచనలు చేశారు. పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని శిశుమందిర్ వారు కోరగా, వేములవాడ లయన్స్ క్లబ్, వేములవాడ రాజన్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తమ వంతు సహాయ సహకారం అందిస్తామని డాక్టర్ సంతోష్ కుమార్, కొలిపాక నర్సయ్య తెలపారు. ఎస్సే రైటింగ్ లో గెలిచిన విద్యార్థులకు ఫస్ట్ ప్రైజ్ సెకండ్ ప్రైజ్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోహర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజేందర్, మోటూరి మధు, ప్రధాన చార్యులు రాంప్రసాద్, ఘర్షకుర్తి వెంకన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com